


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAMUDHRA | RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్ గిరి | సోమవారం | 19-10-2026 | సంపుటి: 3 | సంచిక: 255 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | MONDAY | 19-10-2026 | V0LUME : 3 | ISSUE : 255 | PAGES: 8 | COST: 2/- |



విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575


# గవర్నర్ కోటాపై ఆశలు..

- ఎమ్మెల్సీ స్థానాలపై కాంగ్రెస్ నేతల గురి
- ప్రభుత్వ పెద్దలు, పార్టీ ముఖ్యులతో ఆశావహుల వరుస భేటీలు
- పార్టీ సేవలు, సామాజిక సమీకరణాల ప్రాతిపదికన అవకాశం కోరుతున్న నేతలు
- తమకు పదవి దక్కేలా ముందస్తు ప్రయత్నాలు
- అధిష్ఠానం నిర్ణయంపై ఆశావహుల్లో ఉత్కంఠ

హైదరాబాద్, అక్టోబర్ 18:

తెలంగాణ కాంగ్రెస్‌లో పదవుల కోసం ఆశావహుల ప్రయత్నాలు వేగం పుంజుకుంటున్నాయి. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందడి కొనసాగుతుండగానే గవర్నర్ కోటాలో దక్కే ఎమ్మెల్సీ స్థానాలపై పలువురు నేతలు ఆశలు పెట్టుకున్నారు. తమకు అవకాశం కల్పించాలంటూ ప్రభుత్వంలోని కీలక వ్యక్తులు, పార్టీ ముఖ్య నాయకులను కలుస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. పదవుల భర్తీపై స్పష్టత లేకపోయినా ముందుగానే తమ అభ్యర్థిత్వాన్ని నాయకత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు.

మిగతా 2వ పేజీలో..





# సద్దుల బతుకమ్మతో తెలంగాణలో పూల సంబరం

## హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై అంబరాన్నంటిన వేడుకలు

- 700 మంది కళాకారులతో జానపద కళారూపాల ప్రదర్శన
- లేజర్ షోలు, బాణసంచాతో ప్రత్యేక ఆకర్షణ
- రాష్ట్రవ్యాప్తంగా పల్లెపల్లెలో మహిళల సందడి

హైదరాబాద్, అక్టోబర్ 18:

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా వైభవంగా జరిగాయి. హైదరాబాద్‌లోని హుస్సేన్ సాగర్ తీరాన ట్యాంక్‌బండ్ పూల పండుగ శోభతో కళకళలాడింది. వేలాది మంది మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తుల్లో వేడుకల్లో పాల్గొన్నారు. బతుకమ్మ పాటలు, కోలాటాలు, జానపద కళారూపాలతో పరిసరాలు మార్మోగాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో పండుగ సందడి నెలకొంది.

### పూలతో బతుకమ్మల అలంకరణ

* తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర పూలతో మహిళలు బతుకమ్మలను అందంగా పేర్చారు. వాటి చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ నృత్యాలు చేశారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో ట్యాంక్‌బండ్ ప్రాంతం పూలవనాన్ని తలపించింది. తెలంగాణ ఆచార వ్యవహారాలు, గ్రామీణ జీవనశైలి వేడుకల్లో ప్రతిబింబించాయి.

మిగతా 2వ పేజీలో..

# చైనా ఏజెంట్లకు రహస్య సమాచారం చేరవేత?..

3

## ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు న్యాయం చేయకుంటే ఉద్యమం: కవిత

- జీతాల కోత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్
- జీవో 1195ను సమీక్షించాలని సీఎం రేవంత్‌కు సూచన
- ఒక్కొక్కరి వేతనంలో రూ.4 వేల నుంచి రూ.5 వేల కోత

2



## హైదరాబాద్ మెట్రోకు పెరుగుతున్న నష్టాలు

- ఆరు నెలల్లో రూ.405.86 కోట్ల నష్టం
- రూ.524.78 కోట్లకు చేరిన మొత్తం ఆదాయం
- వడ్డీలకే రూ.522.61 కోట్లు ఖర్చు

2






## జర్మనీ ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు టోమ్‌కామ్ టోకరా?

- 70 మందికి పైగా యువత నుంచి కోట్లాది రూపాయల వసూలు
- రూ.4.5 లక్షలు చెల్లించినా దక్కని ఉద్యోగాలు
- హరీశ్‌రావు ఆరోపణలు.. రెండేళ్లుగా ఎదురుచూపులు
- విచారణ జరిపి బాధితులకు పరిహారం చెల్లించాలని డిమాండ్

2

# ఆలయాల అభివృద్ధికి రూ.2,500 కోట్లు

- నాచారం వెంకటేశ్వరస్వామి ఆలయ రహదారికి శంకుస్థాపన
- రూ.44 కోట్లతో భక్తులకు మెరుగైన రహదారి సౌకర్యం
- రహదారుల నిర్మాణానికి రూ.90 వేల కోట్ల కేటాయింపు
- సంక్షేమ పథకాల కొనసాగింపే లక్ష్యం: భట్టి విక్రమార్క

2





# తాగునీటి వృథాపై జలమండలి కొరడా

- జూబ్లీహిల్స్ పబ్‌కు రూ.20 వేల జరిమానా
- తాగునీటి కనెక్షన్ తొలగింపు.. ట్యాంకర్ల సరఫరా నిలిపివేత
- వాణిజ్య సంస్థలకు జలమండలి హెచ్చరిక
- నీటి దుర్వినియోగంపై ఫిర్యాదులకు ప్రత్యేక నంబర్లు

హైదరాబాద్, అక్టోబర్ 18 :

హైదరాబాద్ నగరంలో తాగునీటి దుర్వినియోగాన్ని అరికట్టేందుకు జలమండలి అధికారులు చర్యలు చేపట్టారు. జూబ్లీహిల్స్ సర్కిల్ పరిధిలోని రోడ్ నంబర్ 45, ప్లాట్ నంబర్ 872లో ఉన్న ఫోర్ ఫాదర్స్ పబ్‌లో నీటి దుర్వినియోగం జరుగుతోందన్న ఫిర్యాదు మేరకు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో ఉల్లంఘన జరిగినట్లు గుర్తించిన అధికారులు పబ్ యాజమాన్యానికి రూ.20 వేల జరిమానా విధించారు. తాగునీటి వృథాను నిరోధించేందుకు నిబంధనలను కఠినంగా అమలు చేస్తున్నట్లు జలమండలి వెల్లడించింది. పబ్‌పై జరిమానా విధించడంతోపాటు అక్కడి తాగునీటి కనెక్షన్‌ను అధికారులు తొలగించారు. జలమండలి నింపే కేంద్రం నుంచి వాణిజ్య అవసరాల కోసం నీటి ట్యాంకర్ల

మిగతా 2వ పేజీలో..

## టైగర్ ష్రాఫ్‌పై కాల్పులు.. సల్మాన్ ఖాన్‌తో సాన్నిహిత్యమే కారణమా?



- జుహులో కాల్పుల ఘటన.. టైగర్ ష్రాఫ్‌కు తప్పిన ప్రమాదం
- డ్రైవర్ సహా ఇద్దరికి గాయాలు.. పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం
- లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ పేరుతో సోషల్ మీడియాలో హెచ్చరికలు

3

# ఫ్యూచర్ సిటీపై సీఎం రేవంత్ ఫోకస్..

- నేడు కీలక ప్రాజెక్టులకు శ్రీకారం
- * ఇబ్రహీంపట్నంలో ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ ప్రారంభం
- * యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పనుల పరిశీలన

3

## డిజిటల్ అరెస్టు మోసం.. ఇద్దరు అరెస్టు

రిటైర్డ్ ఉద్యోగి నుంచి రూ.29.17 లక్షలు కాజేత
పోలీసులు, సీబీఐ, ఈడీ అధికారులమంటూ బెదిరింపులు
రూ.6.8 కోట్ల మనీలాండరింగ్ కేసులో ఇరికిస్తామని భయపెట్టిన వైనం
మ్యూల్ ఖాతాలు, క్రిప్టో లావాదేవీలతో సొమ్ము మళ్లింపు

2



# సద్దుల బతుకమ్మతో తెలంగాణలో పూల సంబరం

**700 మంది కళాకారులతో జానపద ప్రదర్శనలు**

* సుమారు 700 మంది కళాకారులు తెలంగాణ జానపద కళారూపాలను ప్రదర్శించారు. సంప్రదాయ నృత్యాలు, జానపద గీతాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. కళాకారుల ప్రదర్శనలను తిలకించేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మహిళల ఐక్యత, ప్రకృతితో ముడిపడిన తెలంగాణ జీవన సంస్కృతి ఈ వేడుకల్లో ప్రత్యేకంగా కనిపించింది.

**లేజర్ షోలు.. బాణసంచా సందడి**

సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు నిర్వహించిన లేజర్ షోలు, బాణసంచా ప్రదర్శనలు వేడుకలకు మరింత శోభను తెచ్చాయి. అమరవీరుల స్మారక కేంద్రం నుంచి ప్రారంభమైన కార్యక్రమాలు ట్యాంక్‌బండ్ వద్ద బతుకమ్మల నిమజ్జనంతో ముగిశాయి. మహిళలు సంప్రదాయ పాటలు పాడుతూ బతుకమ్మకు వీడ్కోలు పలికారు.

**పల్లెపల్లెలో పండుగ సందడి**

* హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని పలు జిల్లాలు, పట్టణాలు, గ్రామాల్లోనూ సద్దుల బతుకమ్మ వేడుకలు ఉత్సాహంగా సాగాయి. మహిళలు ఇళ్ల వద్ద, వీధుల్లో, చెరువుల పరిసరాల్లో బతుకమ్మలను పేర్చి పూజలు నిర్వహించారు. సాయంత్రం వేళల్లో బతుకమ్మల చుట్టూ చేరి పాటలు పాడుతూ సంప్రదాయ నృత్యాలతో సందడి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక ఆచారాలకు అనుగుణంగా వేడుకలు నిర్వహించగా, పట్టణాల్లోనూ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బతుకమ్మ కేవలం పూల పండుగ మాత్రమే కాకుండా తెలంగాణ అస్తిత్వాన్ని, మహిళల ఐక్యతను, ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధాన్ని చాటిచెప్పే సాంస్కృతిక వేడుకగా నిలిచింది. తరతరాలుగా కొనసాగుతున్న ఈ సంప్రదాయం మరోసారి రాష్ట్ర సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పింది.

# హైదరాబాద్ మెట్రోకు పెరుగుతున్న నష్టాలు

- **రోజుకు రూ.2.85 కోట్ల వడ్డీ భారం**

**హైదరాబాద్, అక్టోబర్ 18 :**

హైదరాబాద్ మెట్రో రైలు నష్టాల పరంపర కొనసాగుతోంది. ఎల్ అండ్ టీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న తొలి దశ మెట్రో ప్రాజెక్టును తన ఆధీనంలోకి తీసుకుని లాభాల బాట పట్టించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నప్పటికీ, స్వాధీన ప్రక్రియలో కొన్ని నెలలుగా ప్రతిష్టంభన కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో మెట్రో ఆర్థిక పరిస్థితి మరింత భారంగా మారింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సెప్టెంబర్ 30తో ముగిసిన తొలి ఆరు నెలల కాలానికి సంబంధించిన ఆర్థిక ఫలితాల ప్రకారం, ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రో రూ.405.86 కోట్ల నష్టాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో రూ.380.46 కోట్ల నష్టం నమోదుకాగా, ఈసారి నష్టాలు మరింత పెరిగాయి.మెట్రో నిర్వహణ ద్వారా వచ్చే ఆదాయం గత ఏడాదితో పోలిస్తే కొంత పెరిగినప్పటికీ, ఖర్చులను అధిగమించే స్థాయికి చేరుకోలేకపోయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు ఆరు నెలల్లో మెట్రో రైలు నిర్వహణ, ఇతర కార్యకలాపాల ద్వారా రూ.524.78 కోట్ల ఆదాయం సమకూరింది. గత ఏడాది ఇదే కాలంలో రూ.497.54 కోట్ల ఆదాయం వచ్చింది. అంటే ఆదాయంలో పెరుగుదల నమోదైనప్పటికీ, మొత్తం వ్యయాలు కూడా భారీగా పెరగడంతో నష్టాలను తగ్గించలేకపోయింది. ప్రయాణికుల రవాణా, ఇతర కార్యకలాపాల ద్వారా వస్తున్న ఆదాయం ప్రాజెక్టు ఆర్థిక భారాన్ని భరించడానికి సరిపోవడం లేదని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. మెట్రో నష్టాలకు ప్రధాన కారణాల్లో రుణాలపై చెల్లించాల్సి వస్తున్న వడ్డీ భారం కీలకంగా మారింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లోనే వడ్డీ చెల్లింపుల కోసం రూ.522.61 కోట్లు ఖర్చయ్యాయి. ఈ మొత్తం మెట్రోకు వచ్చిన రూ.524.78 కోట్ల ఆదాయానికి దాదాపు సమానంగా ఉంది. ఫలితంగా ఆదాయంలో అధిక భాగం వడ్డీల చెల్లింపులకే వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం, రుణాలపై వడ్డీ భారం రోజుకు సగటున సుమారు రూ.2.85 కోట్లకు చేరుతోంది. భారీ రుణాలు, వాటిపై నిరంతరం పెరుగుతున్న వడ్డీ చెల్లింపులు మెట్రో ప్రాజెక్టు ఆర్థిక నిర్వహణకు ప్రధాన సవాలుగా నిలుస్తున్నాయి. ఇక మెట్రో రైలు నిర్వహణతోపాటు ఉద్యోగుల జీతభత్యాలు, నిర్మాణానికి సంబంధించిన ఖర్చులు, పరిపాలనా వ్యయాలు, తరుగు వంటి ఇతర అంశాలు కూడా మొత్తం వ్యయాన్ని పెంచుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు ఈ అన్ని ఖర్చులు కలిపి రూ.930.64 కోట్లకు చేరాయి. గత ఏడాది ఇదే ఆరు నెలల కాలంలో మొత్తం వ్యయం రూ.878 కోట్లుగా నమోదైంది. అంటే ఏడాదిలో వ్యయభారం గణనీయంగా పెరిగింది. ఇందులో మెట్రో రైళ్ల నిర్వహణ కోసం మాత్రమే రూ.222.88 కోట్లు ఖర్చయ్యాయి. ఆదాయం పెరిగినప్పటికీ, నిర్వహణ వ్యయాలు, వడ్డీలు, ఇతర చెల్లింపులు కలిపి ఆదాయాన్ని మించిపోవడంతో నష్టాలు కొనసాగుతున్నాయి. ఎల్ అండ్ టీ నుంచి మెట్రో ప్రాజెక్టును స్వాధీనం చేసుకునే ప్రక్రియలో నెలకొన్న ప్రతిష్టంభన నేపథ్యంలో, ప్రాజెక్టు భవిష్యత్తుపై ఆసక్తి నెలకొంది. మెట్రోను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని ఆర్థికంగా మెరుగైన స్థితికి తీసుకురావాలన్న లక్ష్యం ఉన్నప్పటికీ, ప్రస్తుతానికి నష్టాలు తగ్గకపోవడం సవాలుగా మారింది. ఆదాయం పెంపుతోపాటు రుణాలపై వడ్డీ భారాన్ని తగ్గించడం, నిర్వహణ వ్యయాలను సమర్థంగా నియంత్రించడం వంటి అంశాలు ప్రాజెక్టు ఆర్థిక స్థిరత్వానికి కీలకం కానున్నాయి.

# టీజీఆర్టీసీ జేఏసీకి విక్టరీ సర్టిఫికెట్ ఎప్పుడిస్తారు?

- **గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలిచినా ధ్రువీకరణ పత్రం జారీలో జాప్యం**
- **కార్మిక శాఖ తీరుపై జేఏసీ నేతల అసంతృప్తి**
- **మంత్రి వివేక్ వెంకటస్వామి జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి**

**హైదరాబాద్, అక్టోబర్ 18:**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఆర్టీసీ) గుర్తింపు సంఘం ఎన్నికల్లో విజయం సాధించిన జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ)కు విక్టరీ సర్టిఫికెట్ జారీ చేయడంలో కార్మిక శాఖ అధికారులు జాప్యం చేస్తున్నారని జేఏసీ నేతలు ఆరోపించారు. ఎన్నికల ఫలితాలు వెలువడి రోజులు గడుస్తున్నా ధ్రువీకరణ పత్రం అందించకపోవడంపై వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ, వెంటనే సర్టిఫికెట్ జారీ చేయాలని డిమాండ్ చేశారు.

**ఎన్నికల నుంచే అడ్డంకులు..**

ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ), తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టీఎంయూ), నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ)తో కూడిన జేఏసీ కూటమి గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఘన విజయం సాధించింది. అయినప్పటికీ, కార్మిక శాఖ అధికారులు ధ్రువీకరణ పత్రం ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని నేతలు మండిపడ్డారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచే తమకు పలు అడ్డంకులు ఎదురవుతున్నాయని ఆరోపించారు.

*** మంత్రి జోక్యం చేసుకోవాలి**

కార్మిక శాఖ అధికారుల వైఖరిపై మంత్రి వివేక్ వెంకటస్వామి వెంటనే స్పందించి, తమకు న్యాయం జరిగేలా చూడాలని జేఏసీ నేతలు కోరారు. ఎన్నికల ఫలితాలను గౌరవించి, ఎలాంటి జాప్యం లేకుండా విక్టరీ సర్టిఫికెట్ అందించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే తదుపరి కార్యాచరణ చేపడతామని స్పష్టం చేశారు. కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం తమ పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు.

# గవర్నర్ కోటాపై ఆశలు..

**మొదటి పేజీ తరువాయి..**

పార్టీ కోసం చేసిన సేవలు, గతంలో నిర్వహించిన బాధ్యతలు, ఎన్నికల సమయంలో పోషించిన పాత్రను వివరిస్తూ తమకు గుర్తింపు ఇవ్వాలని కోరుతున్నట్లు తెలుస్తోంది. అధికారంలోకి వచ్చిన తర్వాత తమకు తగిన ప్రాధాన్యం దక్కుతుందని ఆశించిన నేతలు.. ఇప్పుడు ఎమ్మెల్సీ పదవులతో పాటు నామినేటెడ్ పోస్టులపైనా దృష్టి సారిస్తున్నారు. చివరి నిమిషం వరకు వేచి చూడకుండా ఇప్పటి నుంచే నాయకులను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నట్లు సమాచారం.

సామాజిక సమీకరణాలపై గురి

గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాల కేటాయింపులో సామాజిక వర్గాల ప్రాతినిధ్యం కీలకంగా మారుతుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. తమ వర్గానికి తగిన ప్రాధాన్యం కల్పించాలని, పార్టీకి చేసిన సేవలను గుర్తించి అవకాశం ఇవ్వాలని ఆశావహులు కోరుతున్నట్లు తెలుస్తోంది. రాజకీయంగా వెనుకబడిన లేదా తగిన ప్రాతినిధ్యం లేని వర్గాలకు పదవులు కేటాయించడం ద్వారా సమతుల్యత సాధించవచ్చని కొందరు నేతలు పార్టీ పెద్దలకు వివరిస్తున్నట్లు చర్చ సాగుతోంది. తమకు అనుకూలంగా ఉన్న నాయకుల ద్వారా అధిష్ఠానం వద్ద సిఫారసులు చేయించుకోవడం, పదవిపై ముందస్తు భరోసా పొందేందుకు ప్రయత్నించడం వంటి వ్యూహాలను కొందరు అనుసరిస్తున్నట్లు సమాచారం. అయితే ఈ ప్రయత్నాలు ఎవరికి ఎంతవరకు కలిసి వస్తాయన్నది ప్రస్తుతం స్పష్టంగా తెలియడం లేదు.

**పట్టభద్రుల ఎన్నికల వేళ మరో లెక్క**

ఓవైపు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కాంగ్రెస్ నాయకత్వం కసరత్తు చేస్తుండగా.. మరోవైపు భవిష్యత్తులో దక్కే పదవుల కోసం నేతలు తమ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహాలపై పార్టీ దృష్టి సారించిన సమయంలోనే గవర్నర్ కోటా పదవుల అంశం తెరపైకి రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. పార్టీ కష్టకాలంలో అండగా నిలిచినవారికి, దీర్ఘకాలంగా పనిచేస్తున్నవారికి, ఎన్నికల్లో కీలక బాధ్యతలు నిర్వర్తించినవారికి గుర్తింపు దక్కాలని ఆశావహులు కోరుతున్నారు. తమకు అవకాశం కల్పిస్తే పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తామని నాయకత్వానికి చెప్పుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే వివిధ పదవుల కోసం ఎదురుచూస్తున్న నేతలకు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాలు మరో కీలక అవకాశంగా కనిపిస్తున్నాయి.

**ఎవరికి కలిసొచ్చేను?**

గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాల భర్తీ విషయంలో కాంగ్రెస్ నాయకత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది. అభ్యర్థుల రాజకీయ నేపథ్యం, పార్టీకి చేసిన సేవలు, సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకుంటుందా? లేక ఇతర రాజకీయ అవసరాలకు ప్రాధాన్యం ఇస్తుందా? అన్న చర్చ పార్టీ వర్గాల్లో సాగుతోంది.

ఆశావహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నప్పటికీ తుది నిర్ణయం పార్టీ నాయకత్వంతో పాటు సంబంధిత రాజ్యాంగ ప్రక్రియపై ఆధారపడి ఉంటుంది. పదవుల భర్తీ ఎప్పుడు చేపడతారనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. అప్పటివరకు ఎవరికి అవకాశం దక్కుతుందనే ఉత్కంఠ కాంగ్రెస్ నేతల్లో కొనసాగనుంది.

# ఆలయాల అభివృద్ధికి రూ.2,500 కోట్లు





**వైరా, అక్టోబర్ 18 :**

ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గంలోని నాచారంలో కొలువుదీరిన శ్రీ అద్భుత వెంకటేశ్వరస్వామిని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తుల సౌకర్యార్థం రూ.44 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఆలయ రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు ప్రయాణ సౌకర్యాలు మెరుగుపరచడం, రాకపోకల్లో ఇబ్బందులను తగ్గించడం లక్ష్యంగా ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఆలయాలకు వచ్చే భక్తులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలిగిన ఆలయాల అభివృద్ధి, భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనలో భాగంగా వివిధ కార్యక్రమాలను చేపడుతున్నట్లు వివరించారు. నాచారం ఆలయ రహదారి పనులు పూర్తయితే స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణం అందుబాటులోకి రానుంది. రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల అభివృద్ధి కోసం రూ.2,500 కోట్లు కేటాయించినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. అదే విధంగా రహదారుల నిర్మాణానికి రూ.90 వేల కోట్లు కేటాయించామని వెల్లడించారు. ఆలయాల అభివృద్ధితో పాటు రవాణా సదుపాయాలను మెరుగుపరచడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. భక్తులు ఆలయాలకు సులభంగా చేరుకునేలా రహదారుల నిర్మాణం, అభివృద్ధి పనులు చేపట్టడం అవసరమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రముఖ ఆలయాలకు వచ్చే భక్తులకు రవాణా సౌకర్యాలు మెరుగుపడితే ప్రయాణ ఇబ్బందులు తగ్గుతాయని వివరించారు. నాచారంలోని శ్రీ అద్భుత వెంకటేశ్వరస్వామి ఆలయానికి రూ.44 కోట్లతో చేపట్టనున్న రహదారి పనులు ఈ దిశగా కీలకమైన చర్యగా నిలవనున్నాయి. రాష్ట్రంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆధ్యాత్మిక కేంద్రాల ప్రగతికి కేటాయింపులు చేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. గత పాలకుల నుంచి సంక్రమించిన రుణాల భారం నెలకు రూ.6,600 కోట్లుగా ఉన్నప్పటికీ ప్రజా సంక్షేమ పథకాలను నిరంతరాయంగా కొనసాగిస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. ఆర్థికపరమైన సవాళ్లు ఉన్నప్పటికీ ప్రజలకు అందించే సంక్షేమ ప్రయోజనాల్లో వెనుకడుగు వేయడం లేదని పేర్కొన్నారు. పేద కుటుంబాలకు అవసరమైన సహాయం అందించడం, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడం ప్రభుత్వ ప్రాధాన్యాల్లో భాగమని వివరించారు. ఆర్థిక పరిస్థితులను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. అభివృద్ధి పనులతో పాటు సంక్షేమ కార్యక్రమాలను కొనసాగించడం ద్వారా వివిధ వర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూర్చాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు వెల్లడించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పేదలకు ఉచిత వైద్యం అందించడంతో పాటు ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రజలకు ప్రయోజనం కల్పిస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. పేద కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం తగ్గించడం, విద్యుత్ అవసరాలకు తోడ్పాటు అందించడం, ఆహార భద్రత కల్పించడం వంటి అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు గృహ వసతి కల్పించే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన కుటుంబాలకు సహాయం అందిస్తూ వారి జీవన పరిస్థితులను మెరుగుపరిచేందుకు చర్యలు చేపడుతున్నామని వివరించారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు సామాజిక భద్రతకు సంబంధించిన కార్యక్రమాలను కూడా కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. పేదలు ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడేందుకు ప్రభుత్వ పథకాలు తోడ్పడాలన్నదే తమ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. విద్యా రంగంలో నాణ్యతను పెంచేందుకు యంగ్ ఇండియా పాఠశాలల ద్వారా విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు చర్యలు చేపడుతున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన పిల్లలకు నాణ్యమైన విద్య అందుబాటులో ఉండాలని, విద్య ద్వారా భవిష్యత్తులో మెరుగైన అవకాశాలు పొందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఉచిత వైద్యం, విద్యుత్, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, యంగ్ ఇండియా పాఠశాలలు వంటి కార్యక్రమాలతో ప్రజలకు ప్రయోజనం కల్పిస్తూ అభివృద్ధి పనులను కూడా కొనసాగిస్తున్నామని వివరించారు. ఒకవైపు ఆలయాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తూనే మరోవైపు రహదారుల నిర్మాణం, విద్య, వైద్యం, గృహ వసతి వంటి రంగాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు న్యాయం చేయకుంటే ఉద్యమం: కవిత

**హైదరాబాద్, అక్టోబర్ 18:**

నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్హెచ్ఎం) ఉద్యోగులకు న్యాయం చేయకపోతే వారి పక్షాన పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు చేపడతామని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. ఉద్యోగుల జీతాల్లో కోత విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 1195ను వెంటనే సమీక్షించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఎన్హెచ్ఎం ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. * రాష్ట్రవ్యాప్తంగా సుమారు 17 వేల మంది ఎన్హెచ్ఎం ఉద్యోగులు పనిచేస్తుండగా, తాజా జీవోతో కొందరి జీతాల్లో రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు కోత పడుతోందని కవిత ఆరోపించారు. నిత్యావసర వస్తువుల ధరలు, ద్రవ్యోల్బణం పెరుగుతున్న తరుణంలో వేతనాలు తగ్గించడం అన్యాయమని మండిపడ్డారు. కొందరికి జీతాలు పెంచి, మరి కొందరికి తగ్గించడంలో వివక్ష కనిపిస్తోందని విమర్శించారు. కేంద్రం ఎన్హెచ్ఎం ఉద్యోగుల వేతనాల కోసం నిధులు ఇస్తున్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం వాటిని సకాలంలో విడుదల చేయడం లేదని ఆరోపించారు.

**ఉద్యోగుల క్రమబద్ధీకరణ ఏదీ?**

* ఎన్నికల ముందు ఎన్హెచ్ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని కవిత విమర్శించారు. కాంగ్రెస్ పాలిత హిమాచల్ ప్రదేశ్‌తో పాటు ఏడు రాష్ట్రాలు ఇప్పటికే ఎన్హెచ్ఎం సిబ్బందిని పర్మినెంట్ చేశాయని గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సైతం 30 శాతం జీతాలు పెంచడంతో పాటు ఉద్యోగుల క్రమబద్ధీకరణ కోసం అసెంబ్లీలో తీర్మానం చేసిందని తెలిపారు.

* గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు, టీకాల కార్యక్రమాల అమలులో ఎన్హెచ్ఎం ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమని కవిత పేర్కొన్నారు. తమ సమస్యలపై నిరసన తెలిపేందుకు అనుమతి నిరాకరించడం, ఆరోగ్య మంత్రి అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం దారుణమని అన్నారు.

* ప్రభుత్వం వెంటనే జీవోను సమీక్షించి, వేతనాల కోతను నిలిపివేయడంతో పాటు ఉద్యోగుల జీతాలు పెంచాలని, సర్వీసులను క్రమబద్ధీకరించాలని కవిత డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోతే వారి హక్కుల సాధన కోసం తమ సంస్థ ఆధ్వర్యంలో ఆందోళనలను ఉద్ధృతం చేస్తామని స్పష్టం చేశారు.

# జర్మనీ ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు టోమ్‌కామ్ టోకరా?

**హైదరాబాద్, అక్టోబర్ 18 :**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ఆధ్వర్యంలోని తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ నిరుద్యోగ యువతను మోసం చేసే వ్యవస్థగా మారిందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. జర్మనీలో ఉద్యోగాలు కల్పిస్తామంటూ 70 మందికి పైగా యువత నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేసి, వారికి ఉద్యోగాలు కల్పించకుండా ఇబ్బందులకు గురిచేశారని సామాజిక మాధ్యమ వేదికగా విమర్శించారు. విదేశాల్లో ఉద్యోగాలు సాధించి కుటుంబాలను ఆదుకోవాలనే ఆశతో డబ్బులు చెల్లించిన నిరుద్యోగులు రెండేళ్లుగా ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ సంస్థ ద్వారా ఇలాంటి పరిస్థితి ఏర్పడటంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

హరీశ్‌రావు వివరాల ప్రకారం, సుమారు 15 జిల్లాలకు చెందిన 70 నుంచి 75 మంది నిరుద్యోగ యువకుల నుంచి టోమ్‌కామ్ ఒక్కొక్కరి వద్ద రూ.4.10 లక్షల చొప్పున వసూలు చేసింది. పరీక్షలు, బీమా, వీసా ఖర్చులు కలిపితే ఒక్కో అభ్యర్థికి దాదాపు రూ.4.5 లక్షల వరకు వ్యయం అయిందని ఆయన తెలిపారు. వీరిలో చాలామంది పేద రైతు కుటుంబాలకు చెందినవారని, విదేశాల్లో ఉద్యోగాలు వస్తాయనే నమ్మకంతో కుటుంబ సభ్యుల బంగారాన్ని తాకట్టు పెట్టి, అప్పులు చేసి మరీ డబ్బులు చెల్లించారని వివరించారు. ఉద్యోగాలు వస్తాయని ఆశించిన యువతకు రెండేళ్లు గడిచినా ఫలితం లేకపోవడంతో అప్పులపై వడ్డీలు చెల్లిస్తూ కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారిందని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల్లో ఒక్కరికి కూడా జర్మనీలోని కంపెనీల నుంచి ఇంటర్వ్యూ అవకాశం రాలేదని హరీశ్‌రావు ఆరోపించారు. జర్మన్ భాషలో బీ1 స్థాయి పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులను ఇప్పుడు బీ2 స్థాయి పరీక్షలో ఉత్తీర్ణులు కావాలని కోరుతూ కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. తొమ్మిది మంది అభ్యర్థులు జర్మనీ వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారని టోమ్‌కామ్ ప్రచారం చేసినప్పటికీ, వారిలో ఒక్కరు కూడా వెళ్లలేదని పేర్కొన్నారు. అభ్యర్థులతో కుదుర్చుకున్న ఒప్పందంలో వివాదాలు తలెత్తితే సుమారు వెయ్యి కిలోమీటర్ల దూరంలోని లక్నో న్యాయస్థానాన్ని ఆశ్రయించాలనే నిబంధన పెట్టడాన్ని ఆయన తప్పుబట్టారు. టోమ్‌కామ్ ద్వారా ఇప్పటివరకు ఎంతమందికి ఉద్యోగాలు కల్పించారో సమాచార హక్కు చట్టం కింద అడిగినా, గడువు ముగిసినప్పటికీ సమాధానం ఇవ్వలేదని ఆరోపించారు. బాధితులు రెండేళ్లుగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న సమయంలో ఈ ఏడాది జూన్‌లో కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి కొత్త టోమ్‌కామ్ బ్యాచ్‌ను ప్రారంభించి ఉద్యోగాలపై హామీలు ఇవ్వడం బాధితులను అవమానించడమేనని హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాల హామీ ఏమైందని, ప్రకటించిన ఉద్యోగాల ప్రణాళిక అమలు ఎక్కడిదాకా వచ్చిందని ప్రశ్నించారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించాల్సిన ప్రభుత్వ సంస్థే ఉద్యోగాల పేరుతో డబ్బులు చెల్లించిన యువతను ఇబ్బందులకు గురిచేస్తోందన్నది తన ప్రధాన ఆరోపణగా పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం వెంటనే స్పందించి బాధితుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. టోమ్‌కామ్, ఫెయిర్‌స్ట్రీట్ ఇండియా సంస్థల ద్వారా వసూలు చేసిన మొత్తాన్ని బాధితులకు తిరిగి చెల్లించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. యువత కోల్పోయిన రెండేళ్ల కాలానికి, వారు భరించిన వడ్డీ భారానికి, మానసిక వేదనకు తగిన పరిహారం అందించాలని కోరారు. ఉద్యోగాలు ఆశించి డబ్బులు చెల్లించిన వారందరికీ ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని, ఈ వ్యవహారంపై నేర పరిశోధన విభాగం లేదా న్యాయ విచారణ జరిపి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఫీజుల రూపంలో ఎంత వసూలు చేశారు, ఇప్పటివరకు ఎంత మందికి ఉద్యోగాలు కల్పించారు అనే వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఇవన్నీ హరీశ్‌రావు చేసిన ఆరోపణలు కాగా, వాటిపై సంబంధిత సంస్థలు, ప్రభుత్వం స్పందన తెలియాల్సి ఉంది.

# డిజిటల్ అరెస్టు మోసం.. ఇద్దరు అరెస్టు

**హైదరాబాద్, అక్టోబర్ 18 :**



డిజిటల్ అరెస్టు పేరుతో ఓ పదవీ విరమణ పొందిన ఉద్యోగి నుంచి రూ.29.17 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్ల కేసులో ఇద్దరు నిందితులను హైదరాబాద్ నగర సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. అమీర్‌పేటకు చెందిన మొహమ్మద్ అష్ఫాక్ హుస్సేన్, అహ్మద్ నజీబ్ ఉద్దీన్‌లను అదుపులోకి తీసుకున్నారు. ఈ మోసంలో బెంగళూరుకు చెందిన సచిన్ అనే మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రభుత్వ దర్యాప్తు సంస్థల అధికారులమంటూ బాధితుడిని భయపెట్టి, విచారణ పేరుతో భారీ మొత్తాన్ని తమ ఖాతాలకు బదిలీ చేయించుకున్నట్లు కేసు వివరాలు వెల్లడిస్తున్నాయి.

నిందితులు ఢిల్లీ పోలీసులం, కేంద్ర దర్యాప్తు సంస్థ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులమంటూ బాధితుడిని సంప్రదించినట్లు పోలీసులు తెలిపారు. రూ.6.8 కోట్ల మనీలాండరింగ్ కేసులో ఆయన ప్రమేయం ఉందని, కేసులో ఇరికిస్తామని బెదిరించినట్లు వెల్లడించారు. ఈ ఆరోపణల నుంచి బయటపడాలంటే ధన సంబంధిత వివరాలను ధ్రువీకరించుకోవాలని, విచారణకు సహకరించాలని చెప్పి బాధితుడిని ఒత్తిడికి గురిచేసినట్లు సమాచారం. అధికారిక విచారణ జరుగుతోందనే భయాన్ని కల్పించి, వారు చెప్పినట్లు చేయకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. వెరిఫికేషన్ పేరుతో బాధితుడితోపాటు ఆయన కుమార్తెను కూడా నిందితులు లక్ష్యంగా చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. విచారణ ప్రక్రియలో భాగంగా డబ్బులను బదిలీ చేయాలని నమ్మించి, విడతలవారీగా మొత్తం రూ.29.17 లక్షలు వసూలు చేసినట్లు కేసు వివరాలు సూచిస్తున్నాయి. ప్రభుత్వ సంస్థల పేర్లు, మనీలాండరింగ్ కేసు ప్రస్తావనతో బాధితుడిని తీవ్ర ఆందోళనకు గురిచేసి మోసానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. డిజిటల్ అరెస్టు పేరుతో నేరగాళ్లు ఉపయోగించే బెదిరింపుల పద్ధతిలోనే ఈ వ్యవహారం సాగినట్లు దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు.

మోసం ద్వారా వచ్చిన సొమ్మును నిందితులు నేరుగా ఒకే ఖాతాలో ఉంచకుండా, ఇతరుల పేర్లతో ఉన్న మ్యూల్ బ్యాంకు ఖాతాల ద్వారా మళ్లించినట్లు పోలీసులు గుర్తించారు. ఆయా ఖాతాల్లో జమ అయిన మొత్తాలను చెక్కుల ద్వారా నగదు రూపంలో ఉపసంహరించుకుని, అనంతరం ఇతర ఖాతాల్లో జమ చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఇలా పలు దశల్లో నగదును బదిలీ చేయడం ద్వారా అసలు లబ్ధిదారులను గుర్తించడం కష్టతరం చేయడానికి ప్రయత్నించినట్లు అనుమానిస్తున్నారు. ఈ వ్యవహారంలో నిందితులు తమ పాత్రకు ప్రతిఫలంగా కమీషన్లు పొందినట్లు పోలీసుల విచారణలో వెల్లడైందని సమాచారం. నేరపూరితంగా సంపాదించిన సొమ్ము ఆనవాళ్లను దాచేందుకు యూఎస్‌డీటీ అనే క్రిప్టో కరెన్సీ ద్వారా కూడా లావాదేవీలు నిర్వహించినట్లు పోలీసులు గుర్తించారు. బ్యాంకు ఖాతాలు, చెక్కుల ద్వారా నగదు ఉపసంహరణ, క్రిప్టో కరెన్సీ లావాదేవీల మధ్య సంబంధాలను పరిశీలిస్తూ దర్యాప్తు కొనసాగిస్తున్నారు. అరెస్టయిన ఇద్దరు నిందితుల నుంచి లభించిన సమాచారం ఆధారంగా పరారీలో ఉన్న సచిన్ ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నారు. అపరిచిత వ్యక్తులు పోలీసులమని, దర్యాప్తు సంస్థల అధికారులమని ఫోన్ చేసి బెదిరిస్తూ డబ్బులు బదిలీ చేయాలని కోరితే నమ్మవద్దని పోలీసులు సూచిస్తున్నారు. నిజమైన దర్యాప్తు పేరుతో డబ్బులు బదిలీ చేయాలని ఎవరూ కోరరని, ఇలాంటి మోసాలపై వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు.

# టైగర్ ష్రాఫ్‌పై కాల్పులు..

## సల్మాన్ ఖాన్‌తో సాన్నిహిత్యమే కారణమా?

ముంబై: బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్‌ను లక్ష్యంగా చేసుకుని ముంబైలోని జుహు ప్రాంతంలో జరిగిన కాల్పుల ఘటన కలకలం రేపింది. ఈ దాడిలో టైగర్ ష్రాఫ్‌కు ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఆయన సురక్షితంగా బయటపడ్డారు. అయితే ఆయన కారు డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తి గాయపడినట్లు సమాచారం. వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటన వెనుక లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ హస్తం ఉన్నట్లు ప్రచారం జరగడంతో బాలీవుడ్ ప్రముఖుల్లో ఆందోళన నెలకొంది.

**సోషల్ మీడియాలో హెచ్చరికలు**

కాల్పుల ఘటనకు తామే బాధ్యులమంటూ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో సంబంధాలున్నట్లు చెప్పుకుంటున్న అనిల్ పండిట్, హర్మాన్ సంధూ పేర్లతో సోషల్ మీడియాలో పోస్టులు, ఆడియో క్లిప్‌లు వెలువడినట్లు కథనాలు పేర్కొంటున్నాయి. టైగర్ ష్రాఫ్‌కు గతంలో హెచ్చరికలు చేసినా పట్టించుకోకపోవడంతోనే దాడికి పాల్పడినట్లు ఆ సందేశాల్లో పేర్కొన్నారని సమాచారం. సల్మాన్ ఖాన్‌తో కలిసి పనిచేసే వారిని కూడా వదిలిపెట్టబోమంటూ హెచ్చరించినట్లు తెలుస్తోంది. అయితే ఈ సందేశాల ప్రామాణికత, దాడితో సంబంధంపై అధికారిక నిర్ధారణ రావాల్సి ఉంది.

**బాబా సిద్దిఖ్ హత్యతో పోలికలు**

గతంలో ఎన్సీపీ నేత బాబా సిద్దిఖ్ హత్య వెనుక కూడా సల్మాన్ ఖాన్‌తో ఆయనకు ఉన్న సాన్నిహిత్యం కారణమని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌పై ఆరోపణలు వచ్చాయి. ఇప్పుడు టైగర్ ష్రాఫ్‌పై కాల్పుల ఘటన నేపథ్యంలో ఆ కేసు మరోసారి చర్చకు వస్తోంది. అయితే రెండు ఘటనల మధ్య సంబంధం ఉన్నట్లు నిర్ధారించే అధికారిక సమాచారం వెలువడలేదు. కాల్పుల ఘటనపై సమాచారం అందుకున్న ముంబై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ పోలీస్ కమిషనర్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నట్లు సమాచారం. నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. సీసీటీవీ దృశ్యాలను పరిశీలిస్తూ, దాడికి పాల్పడినవారి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నట్లు సమాచారం.

# చైనా ఏజెంట్లకు రహస్య సమాచారం చేరవేత?..

- **తెలంగాణకు చెందిన ఆర్మీ అధికారి భార్యపై కేసు**
- **విదేశీ నిఘా సంస్థలతో సంబంధాలున్నాయనే ఆరోపణలు**
- **విద్యావేత్తలుగా పరిచయమైన వ్యక్తుల ద్వారా సమాచార సేకరణకు ప్రయత్నం?**
- **వ్యూహాత్మక అంశాలకు సంబంధించిన పత్రాలు, డేటా బదిలీపై అనుమానాలు**
- **అధికారిక రహస్యాల చట్టం కింద జమ్మూలో ఎఫ్ఐఆర్ నమోదు**

**జమ్మూ, అక్టోబర్ 18:**

దేశ రక్షణకు సంబంధించిన కీలక సమాచారాన్ని విదేశీ వ్యక్తులకు చేరవేశారనే ఆరోపణలపై తెలంగాణకు చెందిన ఓ మహిళపై జమ్మూకశ్మీర్ పోలీసులు కేసు నమోదు చేసినట్లు సమాచారం. ఆమె ఓ సీనియర్ ఆర్మీ అధికారి భార్యగా, ప్రస్తుతం జమ్మూలోని గాంధీ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివసిస్తున్నట్లు తెలుస్తోంది. విదేశీ నిఘా సంస్థలతో సంబంధాలున్న వ్యక్తులతో ఆమె సంప్రదింపులు జరిపారనే అనుమానాల నేపథ్యంలో అధికారులు దర్యాప్తు చేపట్టారు. అయితే, ఆమెపై వచ్చిన ఆరోపణలు ఇంకా నిర్ధారణ కావాల్సి ఉంది.

**విద్యావేత్తల పేరుతో పరిచయాలు?**

ప్రాథమిక దర్యాప్తు వివరాల ప్రకారం.. చైనా నిఘా సంస్థలతో సంబంధాలున్నట్లు అనుమానిస్తున్న కొందరు వ్యక్తులు విద్యావేత్తలుగా పరిచయం చేసుకుని మహిళతో సంబంధాలు ఏర్పరచుకున్నట్లు నిఘా వర్గాలు భావిస్తున్నాయి. తొలుత పర్యావరణం, భౌగోళిక రాజకీయాలపై వ్యాసాలు రాయాలని కోరిన వారు.. ఆ తర్వాత రక్షణ రంగానికి సంబంధించిన అంశాలపై దృష్టి సారించేలా ప్రోత్సహించినట్లు అనుమానిస్తున్నారు. ఈ పరిచయాల ద్వారా ఆమె నుంచి వ్యూహాత్మక ప్రాధాన్యం ఉన్న సమాచారాన్ని సేకరించేందుకు ప్రయత్నించి ఉండవచ్చని దర్యాప్తు అధికారులు భావిస్తున్నట్లు సమాచారం.

**ఎలక్ట్రానిక్ డేటా బదిలీపై ఆరా**

దేశ భద్రతకు సంబంధించిన సున్నితమైన పత్రాలు, ఫొటోలు, ఎలక్ట్రానిక్ సమాచారాన్ని ఎన్‌క్రిప్టెడ్ కమ్యూనికేషన్ మార్గాల ద్వారా విదేశీ వ్యక్తులకు పంపించి ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంలో చైనాతో పాటు ఇతర దేశాలకు చెందిన వ్యక్తుల ప్రమేయం ఉందా అనే కోణంలోనూ విచారణ జరుగుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఏయే పత్రాలు బదిలీ అయ్యాయి, ఎవరికి సమాచారం చేరింది, ఎంతమేరకు నష్టం వాటిల్లే అవకాశం ఉందనే వివరాలు ఇంకా స్పష్టంగా వెల్లడి కాలేదు.

**అధికారిక రహస్యాల చట్టం కింద కేసు**

ఈ వ్యవహారంపై జమ్మూలోని గాంధీ నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నంబర్ 290/2026 నమోదు చేసినట్లు సమాచారం. అధికారిక రహస్యాల చట్టం, 1923లోని సెక్షన్లు 3, 5తో పాటు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సెక్షన్లు 152, 61(2) కింద కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది. మహిళకు విదేశీ వ్యక్తులతో పరిచయాలు ఎలా ఏర్పడ్డాయి, వారి మధ్య ఎలాంటి సమాచార మార్పిడి జరిగింది.

# కీసర మాజీ సీఐ గుట్టు లాగుతున్న ఏసీబీ

- **అక్రమాస్తుల విలువ రూ.20 కోట్లకు పైగానే!**
- **రూ.5 లక్షల లంచం తీసుకుంటుండగా ఏసీబీకి చిక్కిన అరకపల్లి ఆంజనేయులు**
- **ఇళ్లు, భూములు, బంగారం సహా రూ.2.28 కోట్ల ఆస్తుల గుర్తింపు**
- **మార్కెట్ ధరల ప్రకారం ఆస్తుల విలువ రూ.20 కోట్లకు పైనే ఉంటుందని అంచనా**
- **నాలుగు ప్రాంతాల్లో సోదాలు.. మరికొన్ని భూములపై కొనసాగుతున్న దర్యాప్తు**

**హైదరాబాద్, అక్టోబర్ 18:**



లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు పట్టుబడిన కీసర మాజీ ఇన్‌స్పెక్టర్ అరకపల్లి ఆంజనేయులు భారీగా అక్రమాస్తులు కూడబెట్టినట్లు విచారణలో వెలుగులోకి వచ్చింది. ఆయనకు చెందిన ఇళ్లు, స్థలాలు, వ్యవసాయ భూములు, బంగారం తదితర ఆస్తుల విలువ ప్రభుత్వ లెక్కల ప్రకారం రూ.2.28 కోట్లుగా గుర్తించారు. ప్రస్తుత మార్కెట్ ధరల ఆధారంగా వీటి విలువ రూ.20 కోట్లకు పైగా ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆంజనేయులు, ఆయన బంధువులు, బినామీలకు సంబంధించిన నాలుగు ప్రాంతాల్లో శనివారం తనిఖీలు నిర్వహించి పలు ఆస్తులకు సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే అభియోగంపై కేసు నమోదు చేసినట్లు ఏసీబీ ప్రకటించింది.

**హైదరాబాద్‌తో పాటు నల్గొండ జిల్లాలో ఆస్తులు**

ఎల్బీనగర్ పరిసరాల్లో ఆంజనేయులుకు 540 చదరపు గజాల భూమి ఉన్నట్లు గుర్తించారు. హైదరాబాద్‌లోని లింగోజిగూడ, సరూర్‌నగర్ ప్రాంతాల్లో రూ.30 లక్షల విలువైన 150 చదరపు గజాల విస్తీర్ణం కలిగిన రెండు ప్లాట్లు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. మన్సూరాబాద్‌లో రూ.40 లక్షల విలువైన పాత ఇల్లు ఉన్నట్లు గుర్తించారు. నల్గొండ జిల్లాలోని పేరూరులో రూ.50 లక్షల విలువైన ఇల్లు, మిర్యాలగూడ, హాలియా ప్రాంతాల్లో రూ.80 లక్షల విలువైన రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు ఏసీబీ గుర్తించింది. వీటితోపాటు హాలియా, మిర్యాలగూడ పరిసరాల్లో మరికొన్ని వ్యవసాయ భూములు ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారించి, వాటి వివరాలపై దర్యాప్తు కొనసాగిస్తోంది.

**నగదు, బంగారం, కారు స్వాధీనం**

ఆంజనేయులుకు సంబంధించిన నివాసాల్లో తనిఖీలు చేపట్టిన అధికారులు రూ.7 లక్షల నగదు, 60 తులాల బంగారం, రూ.6.5 లక్షల విలువైన కారు, రూ.10 లక్షల విలువైన ఇతర వస్తువులు, ఎలక్ట్రానిక్ పరికరాలను గుర్తించారు. ఆస్తులకు సంబంధించిన పత్రాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో లభించిన మరికొన్ని ఆస్తుల వివరాలను పరిశీలిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

**రూ.10 లక్షలు అడిగి.. రూ.5 లక్షలకు ఒప్పందం**

ఆంజనేయులు లంచం వ్యవహారం ఆగస్టు 31న వెలుగులోకి వచ్చింది. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో లారీలో అక్రమంగా తరలిస్తున్న 650 బస్తాల రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో సయ్యద్ ఇర్షాద్‌ను అదుపులోకి తీసుకుని కీసర పోలీసులకు అప్పగించడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పట్లో కీసర ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఆంజనేయులు.. నిందితుడిని అరెస్టు చేయకుండా నోటీసులు జారీ చేసేందుకు రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు ఏసీబీ గుర్తించింది. చివరకు రూ.5 లక్షలకు ఒప్పందం కుదిరింది. ఆంజనేయులు ఆదేశాల మేరకు బాధితుడి నుంచి లంచం తీసుకుంటున్న సమయంలో ఎస్ఐ జ్ఞానేందర్ రెడ్డిని ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఈ వ్యవహారంలో ఆంజనేయులు పాత్ర కూడా ఉన్నట్లు తేలడంతో ఇద్దరినీ అరెస్టు చేశారు. సెప్టెంబర్ 17న ఆంజనేయులును అరెస్టు చేసి జైలుకు తరలించారు. లంచం కేసులో అరెస్టయిన నెల రోజుల వ్యవధిలోనే ఆయనపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు కావడం గమనార్హం.

# తాగునీటి వృథాపై జలమండలి కొరడా





**మొదటిపేజీ తరువాయి**

ద్వారా అందించే సరఫరాను కూడా నిలిపివేశారు. నీటి దుర్వినియోగం విషయంలో ఫిర్యాదులను పరిశీలించి, ఉల్లంఘనలు నిర్ధారణ అయినప్పుడు సంబంధిత సంస్థలపై చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. జరిమానాలతోపాటు నీటి కనెక్షన్ల తొలగింపు వంటి చర్యలు కూడా ఉంటాయని హెచ్చరించారు.

రానున్న వేసవిలో నీటి లభ్యతపై ఒత్తిడి పెరిగే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటిని పొదుపుగా వినియోగించాలని జలమండలి ప్రజలకు సూచించింది. ముఖ్యంగా హోటళ్లు, రెస్టారెంట్లు, పబ్‌లు, ఇతర వాణిజ్య సంస్థలు నీటిని బాధ్యతాయుతంగా ఉపయోగించాలని కోరింది. తాగునీటిని అనవసరంగా వృథా చేయకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొంది. నీటి వనరుల పరిరక్షణలో గృహ వినియోగదారులతోపాటు వ్యాపార సంస్థలు కూడా భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేసింది.

నగరంలో ఎక్కడైనా తాగునీటి దుర్వినియోగం జరిగినట్లు గుర్తిస్తే ప్రజలు జలమండలికి ఫిర్యాదు చేయవచ్చని అధికారులు తెలిపారు. ఘటనకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు, వ్యక్తులు లేదా సంస్థల వివరాలు, ప్రాంతం, పూర్తి చిరునామాతో సహా 99499 30003 వాట్సాప్ నంబర్‌కు పంపాలని సూచించారు. అదేవిధంగా 155313 వినియోగదారుల సేవా నంబర్ ద్వారా కూడా ఫిర్యాదు నమోదు చేయవచ్చని వెల్లడించారు. అందిన ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి, ఉల్లంఘనలు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఫిర్యాదు చేసిన వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామని జలమండలి హామీ ఇచ్చింది. నీటి వృథాను అరికట్టడంలో ప్రజల భాగస్వామ్యం కీలకమని పేర్కొంది. నీటిని అవసరమైన మేరకే వినియోగించడం, అనవసరంగా పారబోయకుండా చూడటం ద్వారా అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా ఉపయోగించుకోవచ్చని సూచించింది. నిబంధనలను ఉల్లంఘించే సంస్థలపై చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేసింది. తాగునీటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, దుర్వినియోగం కనిపిస్తే సంబంధిత వివరాలతో అధికారులకు సమాచారం అందించాలని జలమండలి విజ్ఞప్తి చేసింది.

# ఫ్యూచర్ సిటీపై

## సీఎం రేవంత్ ఫోకస్..





- *** నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యునానీ మెడిసిన్ క్యాంపస్‌కు శంకుస్థాపన**
- *** మాస్టర్ ప్లాన్, మౌలిక వసతులపై అధికారులతో సమీక్ష**

**హైదరాబాద్, అక్టోబర్ 19:**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఫ్యూచర్ సిటీ అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా సోమవారం ఆయన ఫ్యూచర్ సిటీ పరిధిలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన పోలీస్ కమిషనరేట్‌ను ప్రారంభించడంతో పాటు, నైపుణ్య శిక్షణ సంస్థ పనులను పరిశీలించి, యునానీ వైద్య విద్యకు సంబంధించిన కొత్త క్యాంపస్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు.

**పోలీస్ కమిషనరేట్ ప్రారంభం**

ఇబ్రహీంపట్నంలో మధ్యాహ్నం 3.30 గంటలకు ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. వేగంగా విస్తరిస్తున్న పారిశ్రామిక, సాంకేతిక రంగాలకు అనుగుణంగా శాంతిభద్రతలను పటిష్ఠం చేయడంలో ఈ కమిషనరేట్ కీలక పాత్ర పోషించనుంది. అనంతరం యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని సందర్శించి, నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో సమీక్షించనున్నారు.

**యునానీ మెడిసిన్ క్యాంపస్‌కు శంకుస్థాపన**

ఫ్యూచర్ సిటీ పరిధిలో ఏర్పాటు చేయనున్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యునానీ మెడిసిన్ (ఎన్ఐయూఎం) నూతన క్యాంపస్ నిర్మాణానికి సీఎం భూమిపూజ చేసి శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా యునానీ వైద్య విద్య, పరిశోధనలకు అవసరమైన మౌలిక వసతులు అభివృద్ధి కానున్నాయి.

**అభివృద్ధి ప్రణాళికలపై సమీక్ష**

పర్యటనలో చివరగా ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాలు, రవాణా అనుసంధానం, భవిష్యత్ అభివృద్ధి కార్యక్రమాలపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించనున్నారు. పర్యటన నేపథ్యంలో ఇబ్రహీంపట్నం, ఫ్యూచర్ సిటీ పరిసరాల్లో అధికారులు భద్రతా ఏర్పాట్లు చేపట్టారు

# ఏఐపై అతిగా ఆధార పడుతున్న యువత..

## మానసిక ఆరోగ్యం దెబ్బ తింటుందని నిపుణుల హెచ్చరిక..




కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో, దానిపై అతిగా ఆధారపడడం యువత మానసిక ఆరోగ్యానికి కొత్త సవాలుగా మారే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రచనలు చేయడం, సందేహాలకు సమాధానాలు తెలుసుకోవడం, వ్యక్తిగత సమస్యలపై సలహాలు తీసుకోవడం, భావోద్వేగ పరమైన తోడ్పాటు పొందడం వంటి అవసరాల కోసం చాలామంది ఏఐ చాట్‌బాట్‌లను ఆశ్రయిస్తున్నారు. గతంలో ఆహారం, సంస్కృతి, కథనాలపై ఆసక్తిగా రచనలు చేసిన ఓ యువ రచయిత.. ఇప్పుడు ఏఐ సహాయం లేకుండా రాయలేకపోతున్నానని చెప్పడం ఈ సమస్య తీవ్రతను తెలియజేస్తోంది. అయితే, ఏఐని తరచూ ఉపయోగించడం మాత్రమే వ్యసనంగా భావించకూడదు. దాని సహాయం లేకుండా పని చేయలేకపోవడం, నిర్ణయాలు తీసుకోలేకపోవడం లేదా భావోద్వేగాలను నియంత్రించలేకపోవడం వంటి పరిస్థితులు ఏర్పడినప్పుడు ఆందోళన చెందాల్సి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

### ఏఐ చాట్‌బాట్‌ల పట్ల ఆకర్షణ..

యువతకు చిన్నప్పటి నుంచే డిజిటల్ సంభాషణలు, ఆన్‌లైన్ సమాచార వినియోగం అలవాటుగా మారడంతో ఏఐ చాట్‌బాట్‌లకు త్వరగా ఆకర్షితులవుతున్నారని నిపుణులు వివరిస్తున్నారు. తక్షణమే సమాధానాలు అందించడం, వ్యక్తిగతంగా స్పందిస్తున్నట్లు అనిపించడం వల్ల వాటిపై నమ్మకం పెరుగుతోంది. గణిత సమస్యలకు సరైన సమాధానాలు ఇచ్చే ఏఐ, వ్యక్తిగత సంబంధాలు, భావోద్వేగ సమస్యలపైనా సరైన సలహా ఇస్తుందని కొందరు భావిస్తున్నారు. కానీ ఒక సమాధానం స్పష్టంగా, నమ్మకంగా కనిపించినంత మాత్రాన అది సరైనదని చెప్పలేం. పదేపదే ఏఐ నుంచే ధైర్యం, ఆమోదం, సాంగత్యం కోరుకోవడం.. మనుషులతో మాట్లాడడం కంటే చాట్‌బాట్‌తో సంభాషించడమే సులభంగా అనిపించడం భావోద్వేగ పరమైన ఆధారపడడానికి సంకేతాలు అవుతాయని నిపుణులు పేర్కొంటున్నారు. ఒంటరితనం, సామాజిక భయం ఎదుర్కొంటున్నవారికి ఇది తాత్కాలిక ఉపశమనం కలిగించినా, నిజ జీవిత సంబంధాల్లో ఎదురయ్యే భిన్నాభిప్రాయాలు, నిరాశ, అనిశ్చితిని ఎదుర్కొనే సామర్థ్యాన్ని అభివృద్ధి చేసుకునే అవకాశాలు తగ్గుతాయి.

### సృజనాత్మకతపై ప్రభావం..

ఏఐపై అధికంగా ఆధారపడడం సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచన, స్వతంత్ర నిర్ణయ సామర్థ్యంపైనా ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రచనలకు ఆలోచనలు రూపొందించడం, సమాచారాన్ని క్రమబద్ధీకరించడం, వాదనల్లో లోపాలను గుర్తించడం వంటి పనుల్లో ఏఐ సహాయకరంగా ఉంటుంది. అయితే, ఏఐ ఇచ్చిన సమాధానాలను ప్రశ్నించకుండా స్వీకరిస్తూ, స్వయంగా ఆలోచించడం, విశ్లేషించడం, కొత్త ఆలోచనలు అభివృద్ధి చేసుకోవడం వంటి ప్రక్రియలను పక్కనపెడితే నేర్చుకునే అవకాశాలు తగ్గుతాయి. నిద్ర, ఉద్యోగం, చదువు లేదా కుటుంబ బాధ్యతలను నిర్లక్ష్యం చేస్తూ గంటల తరబడి చాట్‌బాట్‌లతో గడపడం, స్నేహితులు, కుటుంబ సభ్యులకు దూరమవడం, ఏఐ అందుబాటులో లేనప్పుడు ఆందోళన చెందడం, సాధారణ నిర్ణయాలకూ దాని ఆమోదం కోరుకోవడం వంటి లక్షణాలను గమనించాలని సూచిస్తున్నారు. అయితే, ఏఐ వినియోగం వల్ల మెదడు పనితీరు లేదా సృజనాత్మకత తప్పనిసరిగా దెబ్బతింటాయని నిర్ధారించే ఆధారాలు ఇంకా సరిపోవు. దాని దీర్ఘకాలిక ప్రభావాలపై మరింత పరిశోధన అవసరమని స్పష్టం చేస్తున్నారు.

### అవగాహన పెంచడం అవసరం..

భారత్‌లో యువత సంఖ్య అధికంగా ఉండడం, మానసిక ఆరోగ్య నిపుణుల సేవలు అందరికీ సులభంగా అందుబాటులో లేకపోవడం వంటి కారణాలతో ఈ అంశంపై అవగాహన పెంచడం ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు. సహాయం కోరడానికి సంకోచించే వారికి ఏఐ ఒక ప్రారంభ మార్గంగా ఉపయోగపడుతుంది. అయితే, అది వైద్య నిర్ధారణ చేస్తుందని, మానసిక సమస్యల తీవ్రతను కచ్చితంగా అంచనా వేస్తుందని లేదా సరైన చికిత్స అందిస్తుందని భావించకూడదు. పాఠశాలలు, కళాశాలలు ఏఐ ప్రయోజనాలు, పరిమితులపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి. తల్లిదండ్రులు పిల్లలను తప్పుపట్టడం లేదా శిక్షించడం కంటే, వారు ఏఐని ఎందుకు ఆశ్రయిస్తున్నారో తెలుసుకుని వారితో బహిరంగంగా మాట్లాడాలి. రోజువారీ జీవితంపై మానసిక సమస్యలు ప్రభావం చూపుతున్నప్పుడు అర్హత కలిగిన నిపుణుల సహాయం తీసుకోవాలి. ఏఐని పూర్తిగా తిరస్కరించడం లక్ష్యం కాకూడదు, దానిని నేర్చుకోవడానికి, సృజనాత్మకతను పెంపొందించుకోవడానికి ఉపయోగించుకుంటూనే, స్వతంత్రంగా ఆలోచించడం, నిజ జీవిత సంబంధాలను కొనసాగించడం, అవసరమైనప్పుడు మనుషుల నుంచి సహాయం పొందడం కీలకమని నిపుణులు పేర్కొంటున్నారు.



# మీకు ఫ్యాటీ లివర్ సమస్య ఉందా.. అయితే ఈ పండ్లు తప్పక తినాలి..!

ఫ్యాటీ లివర్ సమస్యతో బాధపడుతున్న వారి సంఖ్య ఈమధ్య కాలంలో పెరుగుతున్నది. చాలామందిలో ఈ సమస్య ఉన్నా స్వల్ప లక్షణాలతో గుర్తించలేకపోతారు. అయితే గుర్తించేసరికి సమస్య ముదిరి కాలేయం దెబ్బతినడం మొదలవుతుంది. అధిక కొవ్వులు ఉండే ఆహారం, జంక్ ఫుడ్, ఆల్కాహాల్ అలవాటు వంటివి ఫ్యాటీ లివర్ సమస్యకు దారితీస్తాయి. శరీరానికి వ్యాయామం లేకపోవడం కూడా ఈ సమస్యను పెంచుతుంది. అయితే కొన్ని రకాల పండ్లను తరచూ తీసుకోవడం ద్వారా ఫ్యాటీ లివర్ సమస్యను నియంత్రించవచ్చని నిపుణులు చెబుతున్నారు.

### అవకాడోలు

వీటిలో ఆరోగ్యకరమైన ఒమెగా-3 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. దాంతోపాటు మన కాలేయం సమర్థవంతంగా పనిచేసేందుకు, శరీరంలో ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించేందుకు తోడ్పడే రసాయన సమ్మేళనాలు కూడా వీటిలో ఎక్కువ. ఇవి కాలేయ కణాలు దెబ్బతినకుండా కాపాడుతాయని నిపుణులు చెబుతున్నారు.

### బొప్పాయిపండ్లు

వీటిలో అద్భుతమైన జీర్ణ సంబంధిత ఎంజైములు ఉంటాయి. ఈ ఎంజైములు జీర్ణశక్తిని పెంచడంతోపాటు కాలేయాన్ని రక్షిస్తాయని నిపుణులు చెబుతున్నారు. శరీరంలో విష పదార్థాలను తొలగించడంలో, పోషకాలను శరీరం బాగా సంగ్రహించడంలో బొప్పాయిపండు బాగా పనిచేస్తుందని అంటున్నారు.

### దానిమ్మ

దానిమ్మలో పాలిఫెనాల్స్‌గా పిలిచే రసాయన సమ్మేళనాలు ఎక్కువగా ఉంటాయి. ఇవి కాలేయం దెబ్బతినకుండా కాపాడుతాయి. కాలేయం చుట్టూ కొవ్వు చేరకుండా అడ్డుకుంటాయి. మొత్తం శరీర ఆరోగ్యానికి కూడా బాగా తోడ్పడుతాయని నిపుణులు పేర్కొంటున్నారు.

### నారింజ, బత్తాయి, నిమ్మ

నిమ్మజాతి పండ్లలో విటమిన్ సి ఎక్కువ. విటమిన్ సి శరీరంలో విష పదార్థాలను బయటికి పంపడంలో కాలేయానికి తోడ్పడుతుందని నిపుణులు చెబుతున్నారు. అదే సమయంలో ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తుందని, దీనివల్ల కాలేయం సమర్థంగా పనిచేస్తుందని అంటున్నారు.

### పుచ్చపండు

పుచ్చపండ్లలోనూ యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువ. కాలేయం నుంచి విష పదార్థాలను బయటికి పంపించి, సమర్థవంతంగా పనిచేసేందుకు ఇవి తోడ్పడతాయి. ఇవి శరీరంలో నీటి శాతం తగిన స్థాయిలో ఉండేలా చూస్తాయని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

### బెర్రీలు

బెర్రీ జాతి పండ్లలో విభిన్నమైన యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి శరీరంలో ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను, ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తాయి. అదే సమయంలో కాలేయం సమర్థవంతంగా విష పదార్థాలను వడగట్టేందుకు తోడ్పడతాయి.

### యాపిల్స్

వీటిలో విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువ. ఇవి కాలేయం పనితీరును మెరుగుపరుస్తాయి. దాని చుట్టూ కొవ్వు చేరకుండా నియంత్రిస్తాయి. ఫ్యాటీ లివర్ సమస్యను అరికడతాయని నిపుణులు వివరిస్తున్నారు.

# వేగంగా ప్రాచుర్యం పొందుతున్న ప్లయోమెట్రిక్స్ వ్యాయామం.. అంటే ఏమిటి.. ఏం చేయాలి..?

శారీరక దృఢత్వాన్ని పెంచుకోవాలనుకునేవారిలో ప్లయోమెట్రిక్స్, హై ఇంటెన్సిటీ ఇంటర్వెల్ ట్రైనింగ్ (హెచ్ఐఐటీ) వ్యాయామాలు బాగా ప్రాచుర్యం పొందుతున్నాయి. ఈ రెండు పద్ధతుల్లోనూ అధిక శ్రమ అవసరమవుతుంది. అయితే, ఇవి ఒకే రకమైన వ్యాయామాలు కావు. ప్లయోమెట్రిక్స్‌లో కండరాలు తక్కువ సమయంలో ఎక్కువ శక్తిని ఉత్పత్తి చేసేలా వేగవంతమైన, పేలుడు స్వభావం కలిగిన కదలికలు చేస్తారు. హెచ్ఐఐటీలో మాత్రం కొద్దిసేపు అధిక తీవ్రతతో వ్యాయామం చేసి, ఆ తర్వాత విశ్రాంతి లేదా తక్కువ తీవ్రతతో కూడిన కదలికలు చేస్తారు. వ్యక్తి వయసు, శారీరక సామర్థ్యం, వ్యాయామ అనుభవాన్ని బట్టి ఈ రెండింటిని ఎంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.



### ఏం చేయాలి..

ప్లయోమెట్రిక్స్‌లో బాక్స్ జంప్స్, స్క్వాట్ జంప్స్, ముందుకు దూకడం, గెంతులు, జంపింగ్ లంజెస్, ఔషధ బంతిని వేగంగా విసరడం వంటి వ్యాయామాలు ఉంటాయి. ఇవి కండరాల శక్తి, వేగం, దూకే సామర్థ్యం, దిశను వేగంగా మార్చుకునే నైపుణ్యాన్ని మెరుగుపరచడంలో ఉపయోగపడతాయి. ముఖ్యంగా క్రీడాకారులకు ఈ వ్యాయామాలు ప్రయోజనకరంగా ఉంటాయి. మరోవైపు, హెచ్ఐఐటీ అనేది ఒక నిర్దిష్ట వ్యాయామం కాదు.. వ్యాయామాన్ని చేసే విధానం. ఉదాహరణకు, 30 సెకన్ల పాటు వేగంగా సైక్లింగ్ చేసి, మరో 30 సెకన్లు నెమ్మదిగా సైక్లింగ్ చేయడం హెచ్ఐఐటీకి ఉదాహరణ. ఇందులో పరుగు, సైక్లింగ్, రోయింగ్, శరీర బరువుతో చేసే వ్యాయామాలను చేర్చవచ్చు. ప్లయోమెట్రిక్స్ వ్యాయామాలను కూడా హెచ్ఐఐటీ విధానంలో చేయవచ్చు.

### హెచ్ఐఐటీ ప్రయోజనం ఎంత..

కేలరీలను ఖర్చు చేసే విషయంలో హెచ్ఐఐటీ సాధారణంగా ఎక్కువ ప్రయోజనం అందిస్తుందని నిపుణులు చెబుతున్నారు. అయితే, కేవలం కేలరీలను తగ్గించుకోవడమే లక్ష్యంగా ఈ వ్యాయామాలను ఎంచుకోకూడదని సూచిస్తున్నారు. శరీర బలం, గుండె ఆరోగ్యం, కదలికల నాణ్యత, వేగం, శక్తి, మొత్తం శారీరక సామర్థ్యాన్ని మెరుగుపరచుకోవడమే ప్రధాన లక్ష్యంగా ఉండాలని పేర్కొంటున్నారు. ముఖ్యంగా వ్యాయామం కొత్తగా ప్రారంభించేవారు, వృద్ధులు ముందుగా సరైన పద్ధతిలో కదలికలు చేయడం నేర్చుకోవాలి. స్క్వాట్స్, లంజెస్, చేతులతో చేసే తోసే వ్యాయామాలు, లాగే వ్యాయామాలు, సాధారణ శరీర బరువు వ్యాయామాలు, నడక వంటి వాటితో శారీరక సామర్థ్యానికి పునాది వేసుకోవాలి. తగిన బలం, సమన్వయం, కదలికలపై నియంత్రణ లేకుండా అధిక ప్రభావం కలిగించే జంపింగ్ వ్యాయామాలు చేస్తే కండరాలు, కీళ్లు, ఇతర కణజాలాలపై ఒత్తిడి పెరిగే ప్రమాదం ఉంటుంది.

### సామర్థ్యానికి అనుగుణంగా..

ప్రారంభకులకు హెచ్ఐఐటీని వారి సామర్థ్యానికి అనుగుణంగా మార్చుకోవడం సాధ్యమవుతుంది. వేగంగా నడవడం, సైక్లింగ్, నియంత్రిత శరీర బరువు వ్యాయామాలతో తక్కువ ప్రభావం కలిగిన విధానంలో ప్రారంభించవచ్చు. ప్లయోమెట్రిక్స్‌ను మాత్రం ముందుగా బలం, సమన్వయం, సరైన కదలికలపై పట్టు సాధించిన తర్వాత క్రమంగా చేర్చుకోవాలి. శిక్షణ పొందిన క్రీడాకారులు హెచ్ఐఐటీతో పాటు జంప్స్, గెంతులు వంటి ప్లయోమెట్రిక్ వ్యాయామాలు చేయవచ్చు. అయితే, అలసట పెరిగినప్పుడు దూకిన తర్వాత నేలపై సరిగ్గా దిగలేకపోవడం వల్ల గాయాల ప్రమాదం ఉంటుంది. అందువల్ల వేగం, వ్యాయామ తీవ్రత, పునరావృతాల సంఖ్యను ఒక్కసారిగా పెంచకూడదు. హెచ్ఐఐటీ, ప్లయోమెట్రిక్స్ రెండూ ప్రయోజనకరమైన పద్ధతులే అయినప్పటికీ, వాటి లక్ష్యాలు వేర్వేరు. శారీరక దృఢత్వాన్ని పెంచుకోవాలనుకునేవారు ముందుగా సరైన కదలికలు, బలం, సమన్వయాన్ని అభివృద్ధి చేసుకుని, ఆ తర్వాత క్రమంగా తీవ్రతను పెంచుకోవడం ఉత్తమమని నిపుణులు చెబుతున్నారు.

# ఆహారాన్ని ఎక్కువగా తింటూనే బరువును తగ్గించుకోవచ్చా.. అది సాధ్యపడుతుందా.. ఎలా..?

39 ఏళ్ల వయస్సున్న ముగ్గురు పిల్లల తల్లి, సామాజిక మాధ్యమాల ప్రభావశీలి ఎరిన్ స్టాన్జిక్ తన జీవసంబంధ వయసు 22 ఏళ్లుగా ఉందని వెల్లడించారు. ఆహార నియమాలు, వ్యాయామ పద్ధతులను తరచూ సామాజిక మాధ్యమాల్లో పంచుకునే ఆమె.. అధిక పరిమాణంలో ఆహారం తీసుకుంటూనే తక్కువ కేలరీలు పొందే విధానాన్ని అనుసరించి 9 కిలోలకు పైగా బరువు తగ్గినట్లు తెలిపారు. ఐదుగురు సభ్యులున్న తన కుటుంబానికి అవసరమైన ఆహారాన్ని వారానికి సుమారు 20 రకాల ప్రధాన పదార్థాలతోనే సిద్ధం చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ ఆహార విధానాన్ని పాటించడం వల్ల గత 11 నెలలుగా తగ్గిన బరువును కొనసాగించగలుగుతున్నట్లు వివరించారు.



### ఎలాంటి ఆహారం తీసుకోవాలి..

అధిక పరిమాణం, తక్కువ కేలరీల ఆహార విధానంలో కడుపు నిండేలా ఎక్కువ మోతాదులో ఆహారం తీసుకుంటూనే శరీరానికి అందే కేలరీలను నియంత్రిస్తారు. నీరు, పీచు అధికంగా ఉండే పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, కొవ్వు తక్కువగా ఉండే ప్రోటీన్ పదార్థాలకు ఇందులో ప్రాధాన్యం ఇస్తారు. ఇలాంటి ఆహారం ఎక్కువసేపు కడుపు నిండిన భావనను కలిగించి ఆకలి, ఆహారం తినాలనే కోరికలను నియంత్రించడంలో సహాయపడుతుంది. దీంతో భోజన పరిమాణాన్ని బాగా తగ్గించకుండానే బరువు నియంత్రణకు ప్రయత్నించవచ్చు. అయితే, ఆహారంలో పోషక విలువలు సమతుల్యంగా ఉండేలా చూసుకోవడం కూడా అవసరం.

### ఇవి ముఖ్యం..

ఆహారంలో అరటిపండ్లు, బెర్రీలు, ఉల్లిపాయలు, వెల్లుల్లి, చిలగడదుంపలు, అవకాడోలు, ఆకుకూరలు, క్యాబేజీ కుటుంబానికి చెందిన కూరగాయలు, సంపూర్ణ ధాన్యాలతో తయారైన చపాతీలు, ఓట్స్, నల్ల బీన్స్, శనగలు, ఎర్ర కందిపప్పు, క్వినోవా, చియా గింజలు, వాల్‌నట్స్, హమ్మస్, సోయా పాలు, టోఫు, టెంపే వంటి పదార్థాలను చేర్చినట్లు తెలిపారు. అలాగే, ప్యాకెట్లలో లభించే శుద్ధి చేసిన ఆహార పదార్థాలను దాదాపుగా పూర్తిగా మానేయాలి. పండ్లు, కూరగాయలు, తక్కువ ప్రాసెసింగ్ చేసిన సహజ ఆహారాలనే ఎక్కువగా తీసుకోవాలి. వీటిలో పీచు, నీటి శాతం అధికంగా ఉండడంతో తక్కువ కేలరీలతోనే కడుపు నిండిన భావన కలుగుతుంది.

### వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా..

బరువు తగ్గాలంటే శరీరం ఖర్చు చేసే కేలరీల కంటే తక్కువ కేలరీలు ఆహారం తీసుకోవాలి. బరువు తగ్గిన తర్వాత దాన్ని కొనసాగించడానికి కూడా ఈ ఆహార విధానం సులభంగా ఉపయోగపడుతుంది. ఈ విధానం సులభంగా పాటించగలిగేలా, ఆహ్లాదకరంగా ఉండటంతోపాటు ఫలితాలను అందిస్తుంది. అయితే, జీవసంబంధ వయసు అనేది కేవలం ఒక సంఖ్య మాత్రమే కాదు, శరీరంలోని కణాలు, కణజాలాలు, అవయవాల పనితీరును సూచించే అంచనా. వ్యక్తుల అవసరాలు వేర్వేరుగా ఉంటాయి కాబట్టి బరువు తగ్గాలనుకునేవారు తమ ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా సమతుల్య ఆహారాన్ని ఎంచుకోవడం మంచిదని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

# రాష్ట్రంలో కరువు సహాయక చర్యలు చేపట్టాలి

- కరెంట్ కోతలు నివారించాలి..
- ట్రూ అప్ ఛార్జీలు ఉపసంహరించుకోవాలి

**ఖమ్మం రాజముద్ర న్యూస్ :**




రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో వెంటనే కరువు సహాయక చర్యలు చేపట్టాలని ఎఐకెఎంఎస్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వి. కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి గౌని ఐలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూసుమంచిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎల్ నినో ప్రభావంతో గత 150 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా తీవ్ర అనావృష్టి పరిస్థితులు ఏర్పడతాయని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నార న్నారు. రాష్ట్రంలో అక్టోబర్ 15 నాటికి 23% లోటు వర్షపాతం నమోదైందని, 18 జిల్లాల్లోని 320 మండలాల్లో, 11,479 గ్రామాల్లో తీవ్ర కరువు పరిస్థితులు ఉన్నాయన్నారు. బావులు, బోర్లు ఎండిపోవడంతో రైతులు వేసిన పంటలు చావుబతుకుల్లో ఉన్నాయని, చాలా మంది పంటలను పశువుల మేతకు వదిలేశారన్నారు. ఉన్న కొద్దిపాటి నీటితో పంటలు బతికించుకుందామన్నా అప్రకటిత కరెంటు కోతలు, లో ఓల్టేజీతో మోటార్లు కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు ట్రూ అప్ చార్జీల పేరుతో రూ. 5460 కోట్ల భారాన్ని ప్రజలపై మోపుతూ యూనిట్ కు 50 పైసల చొప్పున కరెంటు చార్జీలు పెంచడం దారుణమన్నారు. ఈ పెంపును బేషరతుగా విరమించుకోవాలని డిమాండ్ చేశారు. పంటలు వేసి నష్టపోయిన రైతులకు, పంటలు వేయని రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని, పంట రుణాలు మాఫీ చేయాలని, వ్యవసాయ కూలీలకు ఉపాధి ప్యాకేజీ, పశుగ్రాసం, మంచినీరు అందించాలని కోరారు. భూమిలేని కూలీలకు నెలకు రూ. 1000 బకాయిలతో సహా చెల్లించాలన్నారు.

**అక్టోబర్ 26, 27 తేదీలలో జిల్లా కలెక్టరేట్ల ముందు ధర్నాలు**

కరువుపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ, కరువు సహాయక చర్యలు చేపట్టాలని, కరెంటు కోతలు నివారించాలని, ట్రూ అప్ చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 26, 27 తేదీలలో జిల్లా కలెక్టరేట్ల ముందు ధర్నాలు నిర్వహించాలని ఎఐకెఎంఎస్ పిలుపునిచ్చింది. ఈ సమావేశంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి ఏనుగు చంద్రారెడ్డి, రాష్ట్ర నాయకులు ఆకుల పాపయ్య, మందారి డేవిడ్ కుమార్, బందారి ఐలయ్య, ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బజ్జూరి వెంకట్రామిరెడ్డి, ఏనుగుల ప్రకాశ్, కలకొండ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# సద్దుల బతుకమ్మ ప్రతి ఇంటా సుఖ, సంతోషాలు నింపాలి

- ఎన్ఎఫ్ఐ డబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు వడ్ల మంజుల

**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:**



చేవెళ్ల లో భారత జాతీయ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం సద్దుల బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎన్ఎఫ్ఐ డబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు వడ్ల మంజుల హాజరై, సద్దుల బతుకమ్మ సంబరాలలో పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సద్దుల బతుకమ్మన్నారు. తెలంగాణ ఆడపడుచులు ఎంతో భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకునే సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా తెలంగాణ ఆడపడుచులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నమన్నారు. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుంది. ప్రకృతిని పూజిస్తూ, పూలను దేవతగా కొలుస్తూ మహిళలు ఐకమత్యంతో జరుపుకునే ఈ పండుగ మన రాష్ట్ర ప్రత్యేకతను చాటిచెబుతుందన్నారు. తెలంగాణ ఉద్యమంలోనూ బతుకమ్మ పండుగ ప్రజలను ఏకం చేయడంలో కీలక పాత్ర పోషించిందన్నారు. ప్రస్తుత సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని, మహిళలకు సమాన హక్కులు, గౌరవం, భద్రత కల్పించాలని, మహిళా సాధికారతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ప్రకృతిని పరిరక్షిస్తూ, పర్యావరణానికి హాని కలగకుండా పండుగను జరుపుకోవాలని సూచించారు. సద్దుల బతుకమ్మ పండుగ ప్రతి ఇంటా సంతోషాలు నింపాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని తెలిపారు ఈ కార్యక్రమంలో లలిత, వెంకటమ్మ, మాధవి, జయమ్మ, స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

# పర్వేదలో సద్దుల బతుకమ్మ సంబురాలు

- ఆడపడుచుల నృత్యాలతో మార్మోగిన గ్రామ
- సర్పంచ్ సురేందర్ గౌడ్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు

**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:**



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన సద్దుల బతుకమ్మ పండుగ వేడుకలు శంకర్ పల్లి మండలం పర్వేద గ్రామంలో అంబరాన్ని అంటాయి. గ్రామ సర్పంచ్ సురేందర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకలు అత్యంత కోలాహలంగా నిర్వహించడం జరిగింది. తొమ్మిది రోజుల పాటు తెలంగాణ ఆడబిడ్డలు ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకునే బతుకమ్మ పండుగలో చివరి రోజు అయిన సద్దుల బతుకమ్మ రోజున పర్వేద గ్రామంలోని మహిళలంతా ఒకే చోట చేరి సంబరాలు జరుపుకున్నారు. గ్రామంలోని ప్రధాన కూడలి హనుమాన్ ఆలయం ప్రాంగణంలో మహిళలు రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చారు. తంగేడు, గునుగు, బంతి, చామంతి పూలతో తయారు చేసిన బతుకమ్మలు చూడముచ్చటగా కనుల విందుగా ఉన్నాయి. చిన్నారుల నుండి వృద్ధుల వరకు అందరూ సంప్రదాయ దుస్తుల్లో, బతుకమ్మల చుట్టూ వలయంగా చేరి బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో, బంగారు బతుకమ్మ ఉయ్యాలో" అంటూ పాటలు పాడుతూ, కోలాటం ఆడుతూ, నృత్యాలు చేస్తూ సందడి చేశారు. ఆడపడుచుల కేరింతలు, చప్పట్లతో గ్రామమంతా మార్మోగిపోయింది.



**సర్పంచ్ సురేందర్ గౌడ్ ఆధ్వర్యంలో...**

గ్రామ సర్పంచ్ సురేందర్ గౌడ్ ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. మహిళలందరికీ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. సర్పంచ్ సురేందర్ గౌడ్ మాట్లాడుతూ..." బతుకమ్మ పండుగ అనేది మన తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక. మన సంస్కృతిని, మన పూల వైభవాన్ని ప్రపంచానికి చాటే పండుగ. పర్వేద గ్రామంలో ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా మహిళలందరినీ ఒకే చోట చేర్చి ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించడం చాలా సంతోషంగా ఉంది. గ్రామంలోని ఆడపడుచులంతా సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని బతుకమ్మ తల్లిని కోరుకుంటున్నాను" అని తెలిపారు. అనంతరం బతుకమ్మలను ఊరేగింపుగా తీసుకెళ్లి సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు.ఈ వేడుకల్లో గ్రామ ఉప సర్పంచ్, వార్డు సభ్యులు,గ్రామ పెద్దలు,యువజన సంఘాల నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ యువత, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

# పూల సింగిడి..అతివల సందడి

**కామారెడ్డి, రాజముద్ర న్యూస్:**



కామారెడ్డి జిల్లా, మండల కేంద్రాలలో, రామారెడ్డి మండలంలో ఉప్పల్ వాయి, గిద్ద, పోసాని పేట్, రంగంపేట, గొల్లపల్లి, కన్నాపూర్, ఈ సన్న పల్లి, మద్దికుంట, రెడ్డి పెట్, అన్నారం, గ్రామ గ్రామాన సద్దుల బతుకమ్మ ఘనంగా నిర్వహించారు, తీరక్క పువ్వులతో బతుకమ్మలను అలంకరణ చేసి, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల విశిష్టతను భావితరాలకు అందించే లా బతుకమ్మ వేడుకలను ఆనంద ఉత్సవంతో ఆడపడుచులు కొత్త వస్త్రాలు ధరించి, బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యాలు అంగరంగ వైభవంగా చేశారు, అనంతరం గ్రామ చెరువులలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు, సద్దుల బతుకమ్మ కావడంతో గ్రామస్తులందరూ చిన్నలు పెద్దలు, అక్క చెల్లెలు అన్నదమ్ములు అందరూ చెరువు వద్ద వన భోజనాలు చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచులు, పాలకవర్గ సభ్యులు, వి డి సి సభ్యులు, గ్రామ పెద్దలు, అన్ని ఏర్పాట్లు చేశారు, ఈ కార్యక్రమాలకు సహకరించిన ప్రతి ఒక్కరికి గ్రామ సర్పంచులు ధన్యవాదాలు తెలియజేశారు.

# రావులపల్లి రోడ్డును పరిశీలించిన ఎమ్మెల్యే యాదయ్య



**శంకర్ పపల్లి, రాజముద్ర న్యూస్:**

రావులపల్లి రోడ్డు పనులను చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పరిశీలించారు. రోడ్డు పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పనుల్లో జాప్యం లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు పనుల పురోగతిని పరిశీలించి, త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయడంపై రావులపల్లి గ్రామ ప్రజలు ఎమ్మెల్యే కాలే యాదయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శంకర్ పల్లి మండలం పిఏసిఎస్ చైర్మన్ బొల్లారం వెంకటరెడ్డి, , రావులపల్లి కలాన్ సర్పంచ్ సువర్ణ కృష్ణమూర్తి, ఉపసర్పంచ్ బొజ్జ సరిత వెంకట్ రెడ్డి, ఆలం ఖాన్ గూడ మాజీ సర్పంచ్ నరేందర్ రెడ్డి, వార్డు సభ్యులు సుప్రజా శ్రీకాంత్ రెడ్డి, మీనా మల్లేష్, ఉత్తరపల్లి ప్రభాకర్, పట్నం శ్రీనివాస్ (రాజు), గద్దె సురేష్, అమ్జాద్, సభ్యురాలు సునీత, సద్దాం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోడ్డు పనులు త్వరగా పూర్తయితే గ్రామ ప్రజలకు రాకపోకల్లో సౌకర్యం కలుగుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# దుర్గమాతల వద్ద ఎలాంటి గొడవలు పెట్టుకోరాదు

**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:**



దుర్గమాత విగ్రహరాల వద్ద ఎలాంటి అల్లర్లు, గొడవలు పెట్టుకోరాదని రామారెడ్డి ఎస్సై టి.మురళి పేర్కొన్నారు. ఆదివారం దుర్గామాత విగ్రహాలను రామారెడ్డి మండల కేంద్రంతో పాటు రెడ్డిపేట్, మద్దికుంట, పోసానిపేట్, ఉప్పల్వాయి, అన్నారం, ఇస్సన్నపల్లి, గిద్ద తదితర గ్రామాల్లో, తాండల్లో ఎస్సై సందర్శించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో దుర్గమాత విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించాలని దేవుని పాటలుతో ఆనంద, ఉత్సవాల మధ్య దుర్గమాత విగ్రహాల ప్రతిష్టాపన వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించాలని పలు సలహాలు, సూచనలు, పద్ధతులను వివరించారు. దుర్గమాతల వద్ద రాజకీయ నాయకులు రాజకీయ విభాగాలను చూపరాదని కోరారు. దుర్గామాత విగ్రహాల వద్ద అల్లర్లు, గొడవలకు పాల్పడితే సంబంధించిన వారిని అరెస్టు చేస్తామని, కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు. రామారెడ్డి మండల కేంద్రంతో పాటు రెడ్డిపేట్, అన్నారం, మద్దికుంట, ఉప్పల్వాయి, పోసానిపేట్, గిద్ద తదితర గ్రామాల్లో 25 దుర్గమాత విగ్రహాలను ప్రతిష్టాపించారని ఎస్సై మురళి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, రాజకీయ నాయకులు, యువకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# మన బతుకమ్మ మన సంస్కృతి మన ఆత్మ గౌరవం



**మోటకొండూర్. రాజముద్ర న్యూస్:**

యాదాద్రి భువనగిరి జిల్లా మోట కొండూరు మండల పరిధిలోని కొండాపురం గ్రామ సర్పంచ్ కొప్పుల వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలు అందరూ రకరకాల పూలతో బతుకమ్మ పేర్చి గౌరమ్మను పూజించి అంగరంగ వైభవంగా ఆటపాటలతో బతుకమ్మ ఆడి ఆనందించారు. ఈ పండుగ మన గ్రామంలోని ఆడపడుచులందరి జీవితాలలో కొత్త వెలుగుల నింపాలని మనమందరం ఐక్యమత్యంతో ప్రేమ అనురాగాలతో కలిసిమెలిసి ఉండాలని అమ్మవారిని కోరారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్, వార్డ్ మెంబర్లు, గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు మహిళలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# లింగరాజు పల్లి గ్రామంలో సద్దుల బతుకమ్మ వేడుకలు



**ఆత్మకూర్( ఎం). రాజముద్ర న్యూస్:**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్( ఎం) మండలంలోని లింగరాజు పల్లి గ్రామములో గ్రామ సర్పంచ్ ఎర్ర సోమిరెడ్డి ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలు అందరూ రకరకాల పూలతో బతుకమ్మ పేర్చి గౌరమ్మను పూజించి అంగరంగ వైభవంగా ఆటపాటలతో బతుకమ్మ ఆడి ఆనందించారు ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్, వార్డ్ మెంబర్లు, గ్రామ ప్రజలు గ్రామ పెద్దలు భక్తులు మహిళలుఅధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా సద్దుల బతుకమ్మ



**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్ :**

నియోజకవర్గ పరిధిలోని మాధవరం కాలనీలో సద్దుల బతుకమ్మ వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంక్షేమ సంఘం మహిళా నాయకురాలు తెల్ల సదాలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా మహిళల కోసమే ఉన్న ఏకైక పండుగ బతుకమ్మ మాత్రమేనని, పూవులను పూజించే గొప్ప సంస్కృతి తెలంగాణకే సొంతమని అన్నారు. నానేసిన బియ్యం, పాలు, బెల్లం కలిపి గౌరీ మాతకు నైవేద్యంగా నివేదించారు. అనంతరం బతుకమ్మలను పేర్చి చిత్తు చిత్తుల గుమ్మ శివుడి ముద్దుల గుమ్మ.. బంగారు బొమ్మ దొరికినమ్మో ఈ వాడలోన అంటూ ఆడుతూ.. పాడుతూ మహిళలు వైభవంగా బతుకమ్మ ఆటలు ఆడారు. అనంతరం సమీప కొలనులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో కుల మతాలకతీతంగా హాజరై ఉత్సాహంగా బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు.

## మబ్బు అబ్బాస్ ఫౌండేషన్ ఫ్లెక్సీలు చించేసిన వారిపై చట్టపరమైన చర్యలు



**ఆత్మకూర్ (ఎం). రాజముద్ర న్యూస్:**

యాదాద్రి భువనగిరి జిల్లా: ఆత్మకూరు (ఎం) మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మబ్బు అబ్బాస్ ఫౌండేషన్ ఫ్లెక్సీలను చించేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్ తెలిపారు. దసరా, దీపావళి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఇటీవల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ లను గుర్తు తెలియని దుండగులు  అర్ధరాత్రి ఫ్లెక్సీ నీ చించేయడం జరిగింది. వెంటనే స్పందించిన ఫౌండేషన్ టీం సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మబ్బు అబ్బాస్ ఫౌండేషన్ చైర్మన్ మబ్బు మహేష్ ఫ్లెక్సీలను చించడంపై నిరసన ఈరోజు మండల కేంద్రంలో  నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్ మాట్లాడుతూ.. మానవసేవే మాధవసేవ అనే నినాదంతో మబ్బు మహేష్ స్వచ్ఛందంగా మబ్బు అబ్బాస్ ఫౌండేషన్ ను స్థాపించి ఆలేరు నియోజకవర్గ వ్యాప్తంగా సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. సమాజ సేవ కోసం ముందుకొస్తున్న వారిని స్వాగతించాలే కానీ ఇలా నిరుత్సాహపరచడం సరైనది కాదని ఫ్లెక్సీలను చించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో మబ్బు ఫౌండేషన్ టీం మండల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పూల పండుగ..పుడమి మురవగా





**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:**

శంకర్ పల్లి మండల పరిధిలోని మాసాన గూడ గ్రామంలో సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలతో మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి, తీరొక్క పాటలు పాడుతూ, ఆటలాడుతూ చెరువు ప్రాంగణాన్ని మార్మోగించారు. ఈ వేడుకలకు సింగర్ నిర్మల రాథోడ్  గానం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

**గ్రామ ప్రజలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు...**

**సర్పంచ్ బద్రి అర్చన ప్రభు గౌడ్..**

బతుకమ్మ పండుగ ప్రకృతికి, పర్యావరణానికి నిదర్శనమని గ్రామ సర్పంచ్ బద్రి అర్చన ప్రభు గౌడ్ కొనియాడారు. ప్రపంచవ్యాప్తంగా, దేశంలోని పలు రాష్ట్రాల్లో ఎల్ నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొని కరువు విలయతాండవం చేస్తోంది. మన ప్రాంతంలో అక్కడక్కడా వర్షాలు పడినప్పటికీ, కరువు ఛాయలు కనిపిస్తున్నాయి. రాబోయే వర్షాకాలం వరకు వర్షాలు లేవు కాబట్టి, గౌరమ్మ తల్లిని భక్తిశ్రద్ధలతో వేడుకోవాలి" అని అక్కచెల్లెళ్లకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, పాడిపంటలు పండి రైతాంగం సంతోషంగా ఉండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని గౌరమ్మను పూజించాలని సూచించారు. సొంత కుటుంబ శ్రేయస్సుతో పాటు సమాజమంతా సుభిక్షంగా ఉండాలని కాంక్షిస్తూ బతుకమ్మ పాటలు పాడాలన్నారు. ఈ సంబరాల్లో గ్రామ ఉప సర్పంచ్, వార్డు మెంబెర్స్, గ్రామ నాయకులు, గ్రామ ప్రజలు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# దసరా ఉత్సవాలను విజయవంతం చేయాలి

- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



**కామారెడ్డి, రాజ ముద్ర న్యూస్:**

కామారెడ్డి పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించనున్న దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ తెలిపారు. ఈ సందర్భంగా దసరా ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను షబ్బీర్ అలీ స్వయంగా పరిశీలించి కార్యక్రమాల నిర్వహణపై సమీక్షించారు. ఈ ఉత్సవాలను కులమతాలకు, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజలందరూ కలిసి జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులకు ప్రత్యేకంగా ఆహ్వాన పత్రికలు పంపించి ఉత్సవాలకు ఆహ్వానించనున్నట్లు తెలిపారు.అన్ని శాఖల అధికారులతో సమీక్ష  దసరా ఉత్సవాల సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉండేందుకు మున్సిపల్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, క్రీడలు, పోలీస్, అగ్నిమాపక, విద్యుత్, ట్రాఫిక్ తదితర శాఖల అధికారులతో షబ్బీర్ అలీ  సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉత్సవాలకు వచ్చే ప్రజల భద్రత, సౌకర్యాల విషయంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రజల సౌకర్యాలకు ప్రత్యేక ఏర్పాట్లు ఉత్సవాలకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున తాగునీటి సదుపాయం, భద్రతా ఏర్పాట్లు, మరుగుదొడ్లు, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. ప్రజలకు అవసరమైన సమాచారం అందించేందుకు ప్రత్యేక హెల్ప్ డెస్క్ను కూడా ఏర్పాటు చేయనున్నారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు సంబంధిత శాఖలు అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు.  కామారెడ్డి పట్టణంలో దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్  కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సీనియర్ నాయకులు, పాత్రికేయ మిత్రులు, తదితరులు పాల్గొన్నారు.




# చిన్నారుల ముఖాల్లో చిరునవ్వులు నింపిన దర్శ ట్రస్ట్

- రహ్మత్ నగర్ బంగారు మైసమ్మ ఆలయం వద్ద పేద పిల్లలకు కొత్త బట్టల పంపిణీ
- మానవత్వమే మతమంటున్న దర్శ చారిటబుల్ ట్రస్ట్




**యూసుఫ్ గూడ, రాజముద్ర న్యూస్ :**

దుర్గాష్టమి పర్వదినం పురస్కరించుకుని యూసుఫ్గూడ పరిధిలోని రహ్మత్ నగర్ బంగారు మైసమ్మ ఆలయం వద్ద మానవత్వం పరిమళించింది. పండుగ అంటేనే కొత్త బట్టలు, కానీ ఆర్థిక ఇబ్బందులతో కొత్త బట్టలకు నోచుకోని నిరుపేద చిన్నారులకు దర్శ చారిటబుల్ ట్రస్ట్ అండగా నిలిచింది. దర్శ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ శివ మాలతి భూపతి ఆధ్వర్యంలో సుమారుగా 50 మంది పేద పిల్లలకు కొత్త వస్త్రాల పంపిణీ కార్యక్రమం అత్యంత ఘనంగా, ఆత్మీయంగా నిర్వహించారు. ఈ సేవా కార్యక్రమంలో ట్రస్టీలు శివ సాయి కుమార్ భూపతి, సాయి కుమార్ గణేష్, కృష్ణ కుమార్ శర్మ, ఆకుల ప్రసాద్  తదితరులు పాల్గొని చిన్నారులకు స్వయంగా కొత్త బట్టలు అందించి, వారితో కాసేపు గడిపారు. కొత్త బట్టలు అందుకున్న చిన్నారుల ఆనందానికి అవధులు లేవు.ఈ సందర్భంగా ఫౌండర్ శివ మాలతి భూపతి  మాట్లాడుతూ... "దుర్గాష్టమి అంటే శక్తికి ప్రతీక. ఆ తల్లి ఆశీస్సులతో మేము చేసే ఈ చిన్న సహాయం పిల్లల జీవితంలో పెద్ద ఆనందాన్ని నింపాలని కోరుకుంటున్నాం. పండుగ రోజు ప్రతి పేద ఇంట్లోనూ వెలుగులు నిండాలి. అదే మా దర్శ ట్రస్ట్ లక్ష్యం. కేవలం పండుగలకే కాదు, ఏడాది పొడవునా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తాం" అని తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానికులు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తూ, దర్శ ట్రస్ట్ చేస్తున్న సేవలను కొనియాడారు. ట్రస్ట్ సభ్యుల మానవతా దృక్పథం పలువురికి స్ఫూర్తిదాయకంగా నిలిచింది.




# స్కోడా ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ.. ఒక్క ఛార్జ్‌తో 440 కి.మీ.!

**హైదరాబాద్, అక్టోబరు 18 :**

ప్రపంచవ్యాప్తంగా ఎలక్ట్రిక్ కార్లకు డిమాండ్ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ప్రముఖ కార్ల తయారీ సంస్థలు కొత్త విద్యుత్ వాహనాలను మార్కెట్లోకి తీసుకొస్తున్నాయి. తాజాగా స్కోడా తన కొత్త కాంపాక్ట్ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ ఎపిక్ స్పోర్ట్‌లైన్‌ను యూరోపియన్ మార్కెట్‌కు పరిచయం చేసింది. ఆకర్షణీయమైన రూపంతో పాటు మెరుగైన పనితీరు, అధునాతన సాంకేతిక సదుపాయాలతో ఈ కారు అందుబాటులోకి వచ్చింది. అయితే భారత మార్కెట్లో ఈ కారు విడుదలపై ఇంకా స్పష్టత లేదు.




**రెండు బ్యాటరీ ఎంపికలు**

స్కోడా ఎపిక్ స్పోర్ట్‌లైన్‌లో 38.5 కిలోవాట్ అవర్, 55 కిలోవాట్ అవర్ బ్యాటరీ ఎంపికలు ఉన్నాయి. చిన్న బ్యాటరీతో కూడిన వేరియంట్ 133 హెచ్‌పీ శక్తిని, 267 ఎన్‌ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇందులో ఎల్ఎఫ్‌పీ బ్యాటరీని ఉపయోగించారు. ఇక 55 కిలోవాట్ అవర్ బ్యాటరీతో వచ్చే టాప్ వేరియంట్ 208 హెచ్‌పీ శక్తిని, 290 ఎన్‌ఎం టార్క్‌ను అందిస్తుంది. ఈ వేరియంట్‌లో ఎన్‌ఎంసీ బ్యాటరీని అమర్చారు. రెండు వేరియంట్లూ ద్విచక్ర చోదక వ్యవస్థతో పనిచేస్తాయి.

**ఒక్క ఛార్జ్‌తో 440 కి.మీ.**

38.5 కిలోవాట్ అవర్ బ్యాటరీ వేరియంట్ ఒక్కసారి పూర్తిగా ఛార్జ్ చేస్తే 310 కిలోమీటర్ల వరకు ప్రయాణించగలదని కంపెనీ గణాంకాలు సూచిస్తున్నాయి. టాప్ వేరియంట్ 440 కిలోమీటర్ల వరకు ప్రయాణించే సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఈ వేరియంట్ కేవలం 7.1 సెకన్లలో గంటకు 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోగలదు. రెండు వేరియంట్ల గరిష్ఠ వేగం గంటకు 160 కిలోమీటర్లు. వేగవంతమైన డీసీ ఛార్జింగ్ సదుపాయంతో చిన్న బ్యాటరీ వేరియంట్ 23 నిమిషాల్లో, పెద్ద బ్యాటరీ వేరియంట్ 24 నిమిషాల్లో 80 శాతం వరకు ఛార్జ్ అవుతాయని సమాచారం. వాస్తవ ప్రయాణ దూరం, ఛార్జింగ్ సమయం వాతావరణం, డ్రైవింగ్ విధానం, ఛార్జర్ సామర్థ్యంపై ఆధారపడి మారవచ్చు.

**అధునాతన సదుపాయాలు**

ఈ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ పొడవు 4,171 మి.మీ., వెడల్పు 1,798 మి.మీ., ఎత్తు 1,581 మి.మీ.గా ఉంది. ఇందులో ఐదుగురు ప్రయాణించవచ్చు. సామాను పెట్టుకునేందుకు 475 లీటర్ల ట్రంక్ స్థలం అందించారు. 19 అంగుళాల అల్లాయ్ చక్రాలు, ఎల్ఈడీ లైట్లు, 360 డిగ్రీల కెమెరా వ్యవస్థ, 10 స్పీకర్ల కాంటన్ ఆడియో వ్యవస్థ వంటి సదుపాయాలు ఉన్నాయి. రిమోట్ పార్కింగ్, రివర్స్ అసిస్ట్ వంటి సాంకేతిక ఫీచర్లు కూడా ఈ కారులో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.

మొత్తంగా, ఎపిక్ స్పోర్ట్‌లైన్ విద్యుత్ వాహన విభాగంలో స్కోడా నుంచి వచ్చిన కొత్త ఎంపికగా నిలుస్తోంది. అయితే ఈ కారు భారతదేశంలో ఎప్పుడు విడుదలవుతుంది? ధర ఎంత ఉండవచ్చు? అనే అంశాలపై సంస్థ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

## నగోయాలో అట్టహాసంగా ప్రారంభమైన
# పారా ఆసియా క్రీడలు

**నగోయా :**

ఆసియా క్రీడలు ముగిసిన కొద్ది రోజుల్లోనే మరో ప్రతిష్ఠాత్మక పోరుకు తెరలేచింది. జపాన్‌లోని నగోయా నగరంలో 5వ పారా ఆసియా క్రీడలు ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ మెగా టోర్నీలో భారత పారా అథ్లెట్లు భారీ అంచనాలతో బరిలోకి దిగుతున్నారు. మొత్తం 11 క్రీడాంశాల్లో దేశం తరఫున 168 మంది అథ్లెట్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. చైనా (హాంగ్‌జౌ)లో జరిగిన గత 2022 క్రీడల్లో భారత్ నుంచి రికార్డు స్థాయిలో 303 మంది అథ్లెట్లు పాల్గొని, 29 స్వర్ణాలతో సహా మొత్తం 111 పతకాలు కొల్లగొట్టారు. అయితే, ఈసారి అథ్లెట్ల సంఖ్య గణనీయంగా తగ్గిన నేపథ్యంలో.. మళ్లీ పతకాల శతకాన్ని అందుకోవడం సాధ్యమేనా అన్నది ఆసక్తికరంగా మారింది. భారత స్టార్ జావెలిన్ త్రోయర్ సుమిత్ అంటిల్‌తో పాటు హైజంపర్ నిషాద్ కుమార్, స్ప్రింటర్ ప్రీతి పాల్‌లపై దేశం కొండంత ఆశలు పెట్టుకుంది. అలాగే ఆర్చరీలో శీతల్ దేవి, తోమన్ కుమార్.. బ్యాడ్మింటన్‌లో ప్రమోద్ భగత్, సుహాస్‌లు పసిడి పతకాలే లక్ష్యంగా రాణించనున్నారు. షూటింగ్, టేబుల్ టెన్నిస్ విభాగాల్లోనూ భారత్‌కు మెరుగైన పతక అవకాశాలు కనిపిస్తున్నాయి.

**తెలుగు రాష్ట్రాల నుంచి ఆరుగురు వీరులు**

ఈ ప్రతిష్ఠాత్మక క్రీడల్లో తెలుగు రాష్ట్రాల నుంచి ఆరుగురు అథ్లెట్లు దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి రవి రొంగలి, రవని, షేక్ హర్షద్, రవి వీర వెంకట భువన్ బరిలో ఉండగా.. తెలంగాణ నుంచి పారాలింపిక్స్ పతక విజేత జీవాంజి దీప్తి, అకీరా నందన్ పతకాల వేటలో నిలిచారు.

**బ్యాడ్మింటన్‌లో భారత్‌కు తొలి పతకం ఖాయం**

క్రీడల అధికారిక ప్రారంభానికి ముందే శనివారం మొదలైన గ్రూప్ మ్యాచ్‌ల్లో భారత పారా షట్లర్లు అద్భుత ప్రదర్శనతో దూసుకుపోతున్నారు. మహిళల డబుల్స్‌లో మానసి జోషి – తులసిమతి మురుగేశన్ జోడీ సెమీఫైనల్‌కు దూసుకెళ్లి, దేశానికి తొలి పతకాన్ని ఖాయం చేసింది. క్వార్టర్స్ పోరులో ఈ జోడీ 21–10, 21–17తో చైనాకు చెందిన యుమెయ్ లియు – టాంగ్‌టాంగ్ జంటపై ఘన విజయం సాధించింది. మరోవైపు పురుషుల సింగిల్స్‌లో టోక్యో పారాలింపిక్స్ విజేత కృష్ణ వరుసగా రెండో విజయం నమోదు చేసి క్వార్టర్స్ బెర్తును దక్కించుకున్నాడు. ఇతర మ్యాచ్‌ల్లో నితేశ్ కుమార్ 21–6, 21–7తో చామ్‌నాన్వెట్ (థాయ్‌లాండ్)పై, స్టార్ ప్లేయర్ ప్రమోద్ భగత్ 21–17, 21–16తో షియాంగ్ (చైనా)పై ఘన విజయాలు సాధించారు. మహిళల సింగిల్స్‌లో నిత్య శ్రీ 21–18, 21–13తో లిన్ షాంగ్‌బావో (చైనా)ను ఓడించగా, పురుషుల డబుల్స్‌లో సూర్యకాంత్ – నవీన్ జోడీ 21–7, 21–19తో మింగ్‌పన్ లి–షియాంగ్ లిచువాన్ (చైనా) జంటపై పైచేయి సాధించింది. అయితే మహిళల సింగిల్స్‌లో మానసి జోషి 3–21, 3–21తో జపాన్ ప్లేయర్ షినో చేతిలో ఓటమి చవిచూసింది.

# టీ20 సిరీస్ భారత్ కైవసం

## రెండో మ్యాచ్‌లో జింబాబ్వే మహిళలపై 9 వికెట్ల తేడాతో గెలుపు




**రాయ్‌పూర్:** జింబాబ్వేతో జరిగిన రెండో టి20లో మైదానంలో పదునైన బౌలింగ్, బ్యాటింగ్‌లో పరుగుల సునామీతో భారత మహిళల క్రికెట్ జట్టు 9 వికెట్ల తేడాతో జింబాబ్వేపై ఘన విజయం సాధించింది. మూడు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2–0తో తిరుగులేని ఆధిక్యాన్ని సంపాదించి సిరీస్‌ను సొంతం చేసుకుంది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న జింబాబ్వే జట్టుకు భారత బౌలర్లు ఆదిలోనే చుక్కలు చూపిం చారు. నందిని శర్మ వేసిన అద్భుతమైన బంతికి కెలిస్ నధ్లోవు పరుగులేమీ చేయ కుండానే క్లీన్ బౌల్డ్ అయింది. ఆ తర్వాత క్రాంతి గౌడ్ బౌలింగ్‌లో దీప్తి పట్టిన అద్భు తమైన క్యాచ్‌కు షార్నే మేయర్స్ (9) పెవిలియన్ చేరింది. అయితే మధ్య వరుసలో చిపో ముగేరి–తిరిపానో (34), జోసెఫిన్ న్కోమో (27) పోరాడటంతో జింబాబ్వే జట్టు కోలుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో జింబాబ్వే 8 వికెట్ల నష్టానికి 102 పరుగులు మాత్రమే చేయగలిగింది. భారత బౌలర్లలో నికి ప్రసాద్ కేవలం 7 పరుగులిచ్చి 2 వికెట్లు తీసి ప్రత్యర్థిని దెబ్బతీసింది.

**షెఫాలీ, స్మృతి పరుగుల సునామీ**

స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత ఓపెనర్లు షెఫాలీ వర్మ, స్మృతి మంధాన జింబాబ్వే బౌలర్లపై విరుచుకుపడ్డారు. మొదటి ఓవర్ నుంచే బౌండరీల వర్షం కురిపిస్తూ పవర్‌ప్లేలోనే మ్యాచ్‌ను ఏకపక్షం చేశారు. వీరిద్దరూ మొదటి వికెట్‌కు కేవలం 8 ఓవర్లలోనే 96 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. షెఫాలీ వర్మ కేవలం 25 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్సర్లతో 55 పరుగులు చేసి విధ్వంసం సృష్టించింది. చివర్లో బిజా బౌలింగ్‌లో ఆమె అవుటైనప్పటికీ, అప్పటికే భారత్ విజయం ఖాయమైంది. కెప్టెన్ స్మృతి మంధాన 25 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లతో 47 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచింది. దీంతో భారత్ కేవలం 8.5 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 104 పరుగులు చేసి ఘన విజయాన్ని అందుకుంది.

# ఫైనల్లో ఇంగ్లండ్‌ను చిత్తు చేసిన వెస్టిండీస్

వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ (WCL)–2026 విజేతగా వెస్టిండీస్ ఛాంపియన్ నిలిచింది. ఆదివారం షార్జా వేదికగా జరిగిన ఫైనల్లో ఇంగ్లండ్‌ను 9 వికెట్ల తేడాతో చిత్తు చేసి ట్రోఫీని విండీస్ ముద్దాడింది. ఈ తుది పోరులో తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ ఇంగ్లండ్ ఛాంపియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. ఇంగ్లండ్ బ్యాటర్లలో మొయిన్ అలీ(60), ఓవైద్ షా(38) మినహా మిగితా అందరూ దారుణంగా విఫలమయ్యారు. విండీస్ బౌలర్లలో డ్వేన్ బ్రావో మూడు వికెట్లు పడగొట్టగా.. ఫిడెల్ ఎడ్వర్డ్స్, కాట్రెల్, రీఫర్ తలా వికెట్ సాధించారు.

**సిమన్స్ విధ్వంసం**

అనంతరం 160 పరుగుల లక్ష్యాన్ని విండీస్ కేవలం ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి 17 ఓవర్లలో ఛేదించింది. విండీస్ ఓపెనర్ లెండల్ సిమన్స్(53 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్‌లతో 77), చాడ్విక్ వాల్టన్(35 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లతో 58) విధ్వంసకర హాఫ్ సెంచరీలతో చెలరేగారు. ఇంగ్లండ్ బౌలర్లలో అజ్మల్ షాజాద్ ఒక్కడే వికెట్ సాధించాడు. కాగా చాడ్విక్ వాల్టన్‌కు ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు దక్కగా.. డ్వేన్ బ్రావో ప్లేయర్ ఆఫ్‌ది టోర్నమెంట్‌గా నిలిచాడు.



# జైస్వాల్‌కు అన్యాయం: అశ్విన్



భారత యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్‌ను న్యూజిలాండ్ పర్యటనకు వన్డే జట్టు నుంచి తప్పించడంపై టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సెలక్టర్ల నిర్ణయం అన్యాయమని, దురదృష్టకరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ మేరకు తన యూట్యూబ్ ఛానల్‌లో మాట్లాడుతూ సెలక్షన్ కమిటీ తీరును తప్పుబట్టారు. న్యూజిలాండ్ పర్యటనలో ఐదు వన్డేల సిరీస్‌లో భాగంగా చివరి రెండు మ్యాచ్‌లకు కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు విశ్రాంతినిచ్చారు. ఈ నేపథ్యంలో గిల్ స్థానంలో యశస్వి జైస్వాల్‌కు అవకాశం ఇచ్చి ఉండాల్సిందని అశ్విన్ వాదించారు. “శుభ్‌మన్ గిల్ చివరి రెండు వన్డేలు ఆడకపోతే, ఆ స్థానం కచ్చితంగా యశస్వి జైస్వాల్‌కు దక్కాలి. ఇలా జరగడం చాలా దురదృష్టకరం” అని అశ్విన్ పేర్కొన్నారు. గత నాలుగు నెలలుగా జైస్వాల్ అంతర్జాతీయ క్రికెట్‌లో ఏ ఫార్మాట్‌లోనూ మ్యాచ్ ఆడలేదని అశ్విన్ గుర్తుచేశారు.

# భారత బౌలర్లూ మనుషులే: మోర్కెల్

భారత బౌలర్లపై విమర్శలు వెల్లువెత్తుతున్న వేళ బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ వారికి అండగా నిలిచాడు. ప్రతి మ్యాచ్‌లోనూ బౌలర్లు అత్యుత్తమ ప్రదర్శన చేయాలని ఆశించడం సరికాదన్నాడు. వరుస సిరీస్‌లు, ప్రయాణాలతో ఆటగాళ్లు మానసికంగా అలసిపోతున్నారని గుర్తుచేశాడు. వారి ప్రదర్శనను అంచనా వేసేటప్పుడు ఈ అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించాడు. వెస్టిండీస్‌తో టీ20 సిరీస్‌లో భారత బౌలర్లు భారీగా పరుగులు సమర్పించుకోవడంపై విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం బెంగళూరులో ఐదో టీ20కి ముందు మోర్కెల్ మీడియాతో మాట్లాడాడు. సోషల్ మీడియాలో వచ్చే ప్రతి విషయాన్ని తాను చదువుతానని చెప్పాడు. ఆటగాళ్ల మానసిక అలసటను చాలాసార్లు విస్మరిస్తున్నామని పేర్కొన్నాడు. భారత ఆటగాళ్లు ద్వైపాక్షిక సిరీస్‌లు, ఆసియా క్రీడలు, ఇతర కార్యక్రమాలతో బిజీగా గడుపుతున్నారని మోర్కెల్ వివరించాడు. ఆసియా క్రీడల్లో పాల్గొన్న కొందరు ఆటగాళ్లు నేరుగా వెస్టిండీస్ సిరీస్‌కు వచ్చారని చెప్పాడు. ఆ తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో కార్యక్రమంలో పాల్గొనేందుకు ఢిల్లీకి వెళ్లి తిరిగి మ్యాచ్‌లకు సిద్ధమయ్యారని గుర్తుచేశాడు. సరిగ్గా నిద్రపోయి, శారీరకంగా కోలుకుని, మానసికంగా ప్రశాంతంగా ఉన్నప్పుడే ఆటగాళ్లు తమ నైపుణ్యాలను మెరుగ్గా ప్రదర్శించగలరని అన్నాడు.

# గోవాలో ఐపీఎల్ 2027 వేలం



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) అభిమానులకు బీసీసీఐ కీలక అప్‌డేట్ ఇచ్చింది. ఐపీఎల్ 2027 సీజన్‌కు సంబంధించిన వేలం తేదీని, వేదికను బోర్డు ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది వేలం ప్రక్రియ డిసెంబర్ 16న గోవా వేదికగా జరగనుంది. ఈ మేరకు మొత్తం 10 ఐపీఎల్ ఫ్రాంచైజీలకు భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) నుంచి శనివారం సమాచారం అందినట్లు తెలుస్తోంది. గోవాలోని ఐటీసీ గ్రాండ్ హోటల్ ఈ వేలానికి ఆతిథ్యం ఇవ్వనుంది. వేలానికి ఒక రోజు ముందు, అంటే డిసెంబర్ 15న ఫ్రాంచైజీల ప్రతినిధుల కోసం ప్రత్యేకంగా బ్రీఫింగ్ సెషన్ నిర్వహించనున్నారు. బీసీసీఐ లాజిస్టిక్స్ బృందం ఇప్పటికే వాట్సాప్ సందేశం ద్వారా ఫ్రాంచైజీలకు ప్రాథమిక సమాచారం అందించగా, దీనిపై అధికారికంగా ఈ–మెయిల్ ద్వారా ధ్రువీకరణ రావాల్సి ఉంది. గత మూడు సీజన్లుగా ఐపీఎల్ వేలం విదేశీ గడ్డపైనే నిర్వహించారు. 2024 సీజన్ కు దుబాయ్, 2025 సీజన్ కు జెద్దా, 2026 సీజన్ కు అబుదాబి నగరాలు ఈ వేలానికి ఆతిథ్యమిచ్చాయి. ఈ క్రమంలో మూడేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఐపీఎల్ వేలం తిరిగి భారత్‌లో జరగనుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. ఫ్రాంచైజీల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న బోర్డు, ఈసారి స్వదేశంలోనే వేలం నిర్వహించాలని నిర్ణయించింది. ఈ ఏడాది సెప్టెంబర్‌లోనే బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా, ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్ వంటి అధికారులు డిసెంబర్ మధ్యలో గోవాలో వేలం జరపవచ్చని సంకేతాలిచ్చారు.

# ముంబైకి జయవర్ధనే గుడ్‌బై!

ఐపీఎల్‌లో ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన ముంబై ఇండియన్స్ కీలక నిర్ణయం తీసుకుంది. ఆ జట్టు హెడ్ కోచ్ మహేల జయవర్ధనేతో తన అనుబంధాన్ని ముగించుకుంది. ఇరుపక్షాలు పరస్పర అంగీకారంతో విడిపోవాలని నిర్ణయించుకున్నాయి. 2026 సీజన్‌లో జట్టు ఆశించిన స్థాయిలో రాణించకపోవడంతో వచ్చే సీజన్‌కు కొత్త కోచ్‌ను నియమించేందుకు ఫ్రాంచైజీ సిద్ధమవుతోంది. 2026 ఐపీఎల్ సీజన్ ముంబై ఇండియన్స్‌కు నిరాశనే మిగిల్చింది. ఆ సీజన్‌లో జట్టు కేవలం నాలుగు విజయాలకే పరిమితమైంది. ఆటగాళ్ల గాయాలు, అందుబాటులో లేకపోవడం, డ్రెస్సింగ్ రూమ్‌లో విభేదాలు ఉన్నాయన్న వార్తలు జట్టు ప్రదర్శనపై ప్రభావం చూపినట్లు కథనాలు వెలువడ్డాయి. కొత్త హెడ్ కోచ్ ఎంపిక కోసం ఫ్రాంచైజీ ఇప్పటికే పలువురి పేర్లను పరిశీలిస్తున్నట్లు సమాచారం. వచ్చే వారంలో అభ్యర్థులతో ఇంటర్వ్యూలు నిర్వహించే అవకాశం ఉంది. జయవర్ధనే ముంబై ఇండియన్స్‌లో మరో బాధ్యతలో కొనసాగే అవకాశం లేదని తెలుస్తోంది. ముంబైతో జయవర్ధనే ప్రయాణం 2017లో ప్రారంభమైంది. ఆయన కోచింగ్‌లో జట్టు 2017, 2019, 2020 సీజన్లలో ఐపీఎల్ టైటిళ్లు సాధించింది. ముఖ్యంగా 2019, 2020లో వరుసగా ఛాంపియన్‌గా నిలిచింది. దీంతో ఫ్రాంచైజీ చరిత్రలో అత్యంత విజయవంతమైన కోచ్‌లలో ఒకరిగా జయవర్ధనే గుర్తింపు పొందాడు. 2022 నుంచి 2024 వరకు ముంబై ఇండియన్స్ గ్లోబల్ హెడ్ ఆఫ్ పెర్ఫార్మెన్స్‌గా వ్యవహరించిన అతడు.. కోచింగ్, ఆటగాళ్ల ఎంపిక, వ్యూహరచన వంటి బాధ్యతలను పర్యవేక్షించాడు.



# ఢిల్లీకి కొత్త గ్యాంగ్!

## గంగూలీ, యువరాజ్, వాస్‌తో కోచించ్ టీం పటిష్ఠం

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో ఇప్పటివరకు ఒక్కసారి కూడా టైటిల్ గెలవని ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ) జట్టు, రాబోయే సీజన్‌ను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈ క్రమంలో తమ కోచింగ్ సిబ్బందిని పూర్తిగా ప్రక్షాళన చేసింది. భారత క్రికెట్ దిగ్గజాలతో కూడిన శక్తిమంతమైన కోచింగ్ బృందాన్ని ఏర్పాటు చేసింది. భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీని హెడ్ కోచ్‌గా నియమించగా, విధ్వంసకర ఆల్–రౌండర్ యువరాజ్ సింగ్ బ్యాటింగ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. తాజాగా శ్రీలంక ఫాస్ట్ బౌలింగ్ దిగ్గజం చమిందా వాస్‌ను ఫాస్ట్ బౌలింగ్ కోచ్‌గా నియమిస్తూ ఫ్రాంచైజీ కీలక నిర్ణయం తీసుకుంది. చమిందా వాస్‌కు కోచ్‌గా విశేష అనుభవం ఉంది. గతంలో ఆయన శ్రీలంక జాతీయ జట్టుకు, ఎస్ఎల్‌సీ అకాడమీకి పలుమార్లు కోచ్‌గా పనిచేశారు. న్యూజిలాండ్, ఐర్లాండ్ జట్లకు కన్సల్టెంట్‌గా కూడా సేవలందించారు. ఆయనతో పాటు ఐపీఎల్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లలో ఒకరైన భారత మాజీ లెగ్ స్పిన్నర్ అమిత్ మిశ్రా కూడా డీసీ స్పిన్ బౌలింగ్ కోచ్‌గా చేరనున్నట్లు సమాచారం. గతేడాది అన్ని ఫార్మాట్ల క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన మిశ్రాకు ఇదే తొలి కోచింగ్ బాధ్యత కానుంది. ఇప్పటికే జేఎస్‌డబ్ల్యూ డైరెక్టర్ ఆఫ్ క్రికెట్‌గా ఉన్న సౌరవ్ గంగూలీ, ఇప్పుడు హెడ్ కోచ్‌గా పూర్తిస్థాయి బాధ్యతలు చేపట్టనున్నారు. ఆయన ఈ ఏడాది దక్షిణాఫ్రికా టీ20 లీగ్‌లో ప్రిటోరియా క్యాపిటల్స్‌కు హెడ్ కోచ్‌గా పనిచేసి కోచింగ్‌లో అడుగుపెట్టారు. ఇక, యువరాజ్ సింగ్ తన అనుభవాన్ని శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, రిషబ్ పంత్ వంటి యువ ఆటగాళ్లకు మెంటార్‌గా పంచుకున్న విషయం తెలిసిందే. కోచింగ్ మార్పులతో పాటు జట్టులోనూ కీలక పరిణామం చోటుచేసుకుంది. లక్నో సూపర్ జెయింట్స్ నుంచి మాజీ కెప్టెన్ రిషబ్ పంత్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ ట్రేడింగ్ ద్వారా తిరిగి దక్కించుకుంది. అతడికి బదులుగా స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌ను లక్నోకు బదిలీ చేసింది. ఐపీఎల్ 2026 సీజన్‌లో ఆరో స్థానంతో సరిపెట్టుకున్న ఢిల్లీ జట్టు, ప్రస్తుతం అక్షర్ పటేల్ కెప్టెన్‌గా ఉంది. ఈ కొత్త బృందంతోనైనా తొలి ఐపీఎల్ టైటిల్ సాధించాలని పట్టుదలగా ఉంది. ఈ మేరకు గంగూలీ, యువరాజ్, వాస్‌ల పర్యవేక్షణలో ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో బెంగళూరు, ఢిల్లీలలో ట్రయల్స్ కూడా నిర్వహించారు.



# బోల్డ్ సినిమాల బాటలో తమన్నా!

**సినిమా డెస్క్:**

మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా వరుస ప్రాజెక్టులతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. గతంలో గ్లామర్ పాత్రలతో పాటు విభిన్న కథల్లో నటించిన ఆమె.. ఇటీవల బోల్డ్ కథాంశాలున్న చిత్రాలు, వెబ్ సిరీస్‌లపై కూడా దృష్టి పెడుతున్నారు. దీంతో తమన్నా ఎంపిక చేసుకుంటున్న కొత్త ప్రాజెక్టులపై సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

**'లస్ట్ స్టోరీస్ 2'తో కొత్త అడుగు**

దాదాపు 18 ఏళ్ల సినీ ప్రయాణంలో తమన్నా విభిన్న పాత్రల్లో నటించారు. అయితే 'లస్ట్ స్టోరీస్ 2' వెబ్ సిరీస్‌తో ఆమె తన తెరపై ప్రదర్శనలో కొత్త కోణాన్ని చూపించారు. ఇందులో ముద్దు సన్నివేశాలు, సన్నిహిత సన్నివేశాల్లో నటించి ప్రేక్షకులను ఆశ్చర్యపరిచారు. అప్పటినుంచి తమన్నా ఎంచుకుంటున్న కథలు, పాత్రలపై చర్చ పెరిగింది.

**'రాగిణి ఎంఎంఎస్ 3'పై ఆసక్తి**

తమన్నా నటిస్తున్నట్లు ప్రచారం జరుగుతున్న 'రాగిణి ఎంఎంఎస్ 3' హారర్ కథాంశంతో పాటు బోల్డ్ అంశాలతో కూడిన చిత్రంగా వార్తల్లో నిలుస్తోంది. ఈ ప్రాజెక్టుకు ఏక్తా కపూర్ నిర్మాణ సంస్థతో సంబంధం ఉన్నట్లు కథనాలు పేర్కొంటున్నాయి. అయితే సినిమాలో తమన్నా పాత్ర, సన్నివేశాల వివరాలపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.

**'ది డర్టీ పిక్చర్ 2'లోనూ నటిస్తారా?**

'ది డర్టీ పిక్చర్ 2'లోనూ తమన్నా నటించనున్నారనే ప్రచారం వినిపిస్తోంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఆమె ఎంపిక ఖరారైందనే విషయంపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఒకవేళ ఈ అవకాశాలు కార్యరూపం దాల్చితే, తమన్నా కెరీర్‌లో మరో కొత్త దశకు నాంది పలికినట్లవుతుంది.

**విభిన్న పాత్రలతో బిజీగా..**

సినిమాలు, ప్రత్యేక పాటలు, ఓటీటీ సిరీస్‌లతో తమన్నా తన కెరీర్‌ను విస్తరించుకుంటున్నారు. కథకు, పాత్రకు ప్రాధాన్యమిస్తూ విభిన్నమైన ప్రయోగాలు చేయడం ద్వారా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రస్తుతం ఆమె పేరుతో వినిపిస్తున్న కొత్త ప్రాజెక్టుల్లో ఎన్ని అధికారికంగా ఖరారవుతాయో వేచి చూడాలి

# కల్ట్ కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుంది

''కల్ట్'కి నా యాక్టింగ్ గురువుల్లో ఒకరైన తాజుద్దీన్‌గారిని డైరెక్షన్ చేయమని అడిగాను. కానీ ఈ మధ్య నా నుంచి వచ్చిన కొన్ని సినిమాలు అనుకున్నంతగా ప్రేక్షకులను మెప్పించలేదు. ఒక సినిమా వర్కవుట్ కాకపోవడానికి చాలా కారణాలుంటాయి. అయితే నేను ఒడ్డున ఉంటేనే మిమ్మల్ని (తాజుద్దీన్) ఒడ్డుకు లాగగలనని చెప్పి, ఈ సినిమాకు నేనే దర్శకత్వం వహిస్తానని చెప్పాను. ఈ సందర్భంగా ఆయనకు క్షమాపణలు చెబుతున్నాను. 'లైలా' సినిమా రిలీజ్ తర్వాత నేను కొంచెం డల్‌గా ఉన్నాను. అప్పుడు మా అన్న నాతో 'నీ వెపన్ నీ చేతిలోనే ఉంది' అని చెప్పారు. అప్పుడు నా కోసం మళ్లీ నేనే నిలబడాలని అర్థమైంది. 'ఫలక్‌నుమా దాస్' సినిమాకి నా కోసం నేను నిలబడ్డాను. సో... 'కల్ట్' సినిమాకు నేనే దర్శకత్వం వహించాలని నిర్ణయించుకున్నాను'' అని విశ్వక్ సేన్ అన్నారు. విశ్వక్ సేన్ కథ–స్క్రీన్ ప్లే అందించి, దర్శకత్వం వహించి, హీరోగా నటించిన చిత్రం 'కల్ట్'.

గాయత్రి భరద్వాజ్, తారక్ పొన్నప్ప, మురళీ శర్మ ప్రధాన పాత్రల్లో నటించారు. సందీప్ కాకరాల నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 30న విడుదల కానుంది. ఆదివారం జరిగిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో విశ్వక్ సేన్ మాట్లాడుతూ– ''ఈ చిత్రం మొదలైన ఐదు నిమిషాలకే ప్రేక్షకులందరినీ ఒక కొత్త ప్రపంచంలోకి తీసుకువెళ్తుంది. ఇందులోని యాక్షన్ కంటే డ్రామాకు ప్రేక్షకులు ఎక్కువగా కనెక్ట్ అవుతారు. నేను ప్రయోగాలు చేసిన ప్రతిసారీ ఆడియన్స్ కనెక్ట్ అయ్యారు. అదే నమ్మకంతో ఈ సినిమా చేశాను. ఇది గ్లోబల్ కంటెంట్. అందుకే జపనీస్, స్పానిష్ భాషల్లో డబ్ చేశాం. ఇది భాషను దాటి వెళ్లే సినిమా'' అని చెప్పారు. ''ఈ చిత్రంలో యాక్టర్‌గా విశ్వక్ విశ్వరూపం చూస్తారు'' అని అన్నారు సందీప్. తారక్ పొన్నప్ప, ఈజీ, అనిరుధ్, కార్తికేయ తదితరులు మాట్లాడారు.






# వచ్చే ఏడాది దీపావళికి ప్రభాస్ 'స్పిరిట్'

పాన్ ఇండియా ప్రేక్షకులంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో 'స్పిరిట్' ముందు వరుసలో ఉంటుంది. సాధారణంగా సందీప్‌రెడ్డి వంగా సినిమాల్లో హీరోలు విచిత్రమైన యాటిట్యూడ్‌తో కనిపిస్తుంటారు. 'అర్జున్‌రెడ్డి'లో విజయ్ దేవరకొండ, 'కబీర్‌సింగ్'లో షాహిద్‌కపూర్, 'యానిమల్'లో రణబీర్‌కపూర్ పాత్రలే అందుకు నిదర్శనాలు. ప్రస్తుతం తెరకెక్కిస్తున్న 'స్పిరిట్' సినిమాలో పాన్ ఇండియా సూపర్‌స్టార్ అయిన ప్రభాస్‌ని సందీప్ ఎలా చూపించబోతున్నాడు?.. అనే ఊహే ప్రేక్షకులను రోమాంచితులను చేస్తున్నది. అందుతున్న సమాచారం ప్రకారం ఇందులో ప్రభాస్ పాత్ర.. విభిన్నంగా, విచిత్రంగా, మాస్ ప్రేక్షకులు మురిసిపోయేలా, సగటు ప్రేక్షకుడు సంబరపడిపోయేలా, యువతరం ఉద్రూతలూగేలా ఉంటుందట. భద్రకాళి పిక్చర్స్, టీ–సిరీస్ ఫిల్మ్స్ కలిసి నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా యాక్షన్ డ్రామా వచ్చే ఏడాది అక్టోబర్ 29న దీపావళి కానుకగా విడుదల కానున్నది. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఆదివారం రిలీజ్ డేట్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఇంటెన్స్, స్టైలిష్, మిస్టీరియస్ అవతారంలో ఉన్న ప్రభాస్‌ని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. బ్లాక్ క్యాప్, డార్క్ సన్ గ్లాసెస్, గడ్డంతో, రఫ్ అండ్ టఫ్‌గా క్లోజప్ ప్రొఫైల్ షాట్‌లో ప్రభాస్ ఈ పోస్టర్‌లో కనిపిస్తున్నారు. పవర్‌ఫుల్ కథతో, క్రేజీ కాంబినేషన్‌లో రానున్న ఈ చిత్రంలో త్రిప్తి డిమ్రీ కథానాయిక.

# సీఎం విజయ్‌తో అనిరుధ్, ఆహ్వానాలు



టాలీవుడ్, కోలీవుడ్ సర్కిల్స్‌లో ఎప్పుడూ హాట్ టాపిక్‌గా ఉండే మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓనర్ కావ్య మారన్ పెళ్లి వార్తలు ఇప్పుడు నిజమయ్యాయి. ఇన్నాళ్లూ ఇదంతా కేవలం సోషల్ మీడియా రూమర్స్ అనుకున్నప్పటికీ, తాజాగా ప్రముఖుల అధికారిక ఆహ్వానాలతో ఈ విషయం కన్ఫర్మ్ అయింది. సన్ గ్రూప్ ఛైర్మన్ కళానిధి మారన్ దంపతులు నేరుగా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి తమ కూతురి పెళ్లికి ఆహ్వానించడం సంచలనంగా మారింది. ఇన్నాళ్లూ వీరిద్దరి పెళ్లిపై రకరకాల ఊహాగానాలు వచ్చినా ఎవరూ అధికారికంగా స్పందించలేదు. కేవలం రూమర్స్ అని కొట్టిపారేశారు. కానీ ఇప్పుడెట్టకేలకు పెద్దలే స్వయంగా రంగంలోకి దిగి పెళ్లి పత్రికలు ఇస్తున్నారు. నవంబర్ 11న గ్రీస్‌లో అత్యంత సన్నిహితుల సమక్షంలో వీరి వివాహం జరగనుండగా, నవంబర్ 21న చెన్నైలో సినీ, రాజకీయ ప్రముఖుల కోసం గ్రాండ్ రిసెప్షన్ నిర్వహించనున్నారు.

# రజినీ 'ధర్మన్'లోకి నయనతార!



సూపర్ స్టార్ రజినీకాంత్ ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ ప్రాజెక్టులతో ఫుల్ స్పీడ్‌లో దూసుకుపోతున్నారు. తాజాగా ఆయన 'జైలర్–2'తో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న 'జైలర్'కు సీక్వెల్‌గా వచ్చిన ఈ 'జైలర్–2' కూడా ప్రజెంట్ బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ టాక్ సొంతం చేసుకుని ప్రశంసలు అందుకుంటుంది. ప్రజెంట్ ఈ సక్సెస్ ఎంజాయ్ చేస్తున్న రజినీకాంత్.. త్వరలో 'ధర్మన్'తో రాబోతున్నాడు. దర్శకుడు అశ్వత్ మారిముత్తు తెరకెక్కిస్తున్న ఈ యాక్షన్ థ్రిల్లర్ చిత్రాన్ని కమల్ హాసన్ తన సొంత బ్యానర్ అయిన 'రాజ్ కమల్ ఫిలిమ్స్ ఇంటర్‌నేషనల్ బ్యానర్‌పై నిర్మిస్తున్నాడు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నాడు. ఇప్పటికే ఈ సినిమా నుంచి వచ్చిన అప్డేట్స్‌తో భారీ హైప్ క్రియేట్ కాగా.. తాజాగా మరో క్రేజీ న్యూస్ నెట్టింట చక్కర్లు కొడుతోంది.



# అదే మా యంగ్ లుక్ రహస్యం: సైఫ్, కరీనా

వయసు మీద పడుతున్నా ఇప్పటికీ యవ్వనంగా, తాజాగా కనిపించడానికి గల రహస్యం ఏమిటని కరీనా కపూర్,సైఫ్ అలీఖాన్‌ను అడగ్గా.. దానికి కారణం దేశీ నెయ్యి అని సైఫ్ చెప్పారు. తమ ఇంట్లో నెయ్యి తప్పనిసరిగా ఉంటుందని, తమ పిల్లలు తైమూర్, జెహ్ కూడా రోజూ నెయ్యి తింటారని కరీనా తెలిపారు. దీనికి సైఫ్ ఇంకొంత జోడిస్తూ, "ఆమె నెయ్యి తినడమే కాదు, రాత్రిపూట పాదాలకు కూడా రాసుకుంటుంది" అని చెప్పగా, అది నిజమేనని, అలా చేయడం వల్ల చాలా మేలు జరుగుతుందని కరీనా అంగీకరించారు.




# రౌడీ జనార్ధన.. క్యూట్‌గా కీర్తి

రౌడీ హీరో విజయ్ దేవరకొండ ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌లో నటిస్తున్న క్రేజీ మూవీ 'రౌడీ జనార్థన'. స్టార్ ప్రొడ్యూసర్స్ దిల్ రాజు, శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. టాలెంటెడ్ యంగ్ డైరెక్టర్ రవికిరణ్ కోలా ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. కీర్తి సురేష్ హీరోయిన్‌గా నటిస్తోంది. రూరల్ యాక్షన్ డ్రామా నేపథ్యంతో భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా రూపొందుతోన్న ఈ సినిమా నుంచి తాజాగా కీర్తి సురేష్ లుక్‌ను రిలీజ్ చేశారు. ఈ రోజు హీరోయిన్ కీర్తి సురేష్ పుట్టినరోజు సందర్భంగా ఆమెకు బర్త్ డే విశెస్ చెబుతూ "రౌడీ జనార్థన" సినిమా నుంచి స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో కీర్తి సురేష్ ట్రెడిషనల్ లుక్‌లో బ్యూటిఫుల్‌గా కనిపిస్తూ ఆకట్టుకుంటోంది. అలాగే బ్యాక్ గ్రౌంట్ లుక్ సినిమాలో ఉండే లవ్ యాంగిల్‌ను ఎంతో క్యూరియాసిటీగా ప్రజెంట్ చేస్తుంది. భారీ అంచనాలు ఉన్న ఈ మూవీ ఈ డిసెంబర్‌లో వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకొచ్చేందుకు ప్లాన్ చేస్తున్నారు మేకర్స్.

# మార్ఫింగ్ కంటెంట్ తొలగించండి



కొందరు తన ప్రమేయం లేకుండానే తన ముఖాన్ని, రూపాన్ని ఉపయోగిస్తూ ఏఐ ద్వారా నకిలీ వీడియోలు, చిత్రాలను సృష్టిస్తున్నారంటూ ట్విట్టర్ వేదికగా నేహా శర్మ సంచలన పోస్ట్ పెట్టారు. సెలబ్రిటీలను టార్గెట్ చేస్తూ వస్తున్న ఈ మార్ఫింగ్, ఫేక్ కంటెంట్‌పై ఆమె తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తన అనుమతి లేకుండా తన ఫేస్ లేదా రూపాన్ని ఉపయోగించి ఏఐ ద్వారా కంటెంట్ క్రియేట్ చేస్తున్న వారు వెంటనే ఆ పనిని ఆపేయాలని హెచ్చరించారు. ఇప్పటికే సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన అటువంటి ఫేక్ వీడియోలు, చిత్రాలను తక్షణమే తొలగించాలని ఆదేశించారు. తన గుర్తింపును ఇలా దుర్వినియోగం చేస్తూ తనను తప్పుగా చిత్రీకరించడం, ప్రతిష్టకు భంగం కలిగించడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని అన్నారు. దీనిని ఒక అధికారిక హెచ్చరికగా పరిగణించాలని ఆమె తేల్చి చెప్పారు. అంతేకాకుండా, నకిలీ ఖాతాల వెనుక దాక్కున్నా లేదా ఏఐ టెక్నాలజీని ఉపయోగించినా బాధ్యులు శిక్ష నుంచి తప్పించుకోలేరని నేహా శర్మ హెచ్చరించారు. ఈ విధమైన కంటెంట్‌ను తయారు చేసినా, పోస్ట్ చేసినా లేదా సోషల్ మీడియాలో ప్రచారం చేసినా సరే ప్రతి ఒక్కరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని బాధ్యులకు గట్టి వార్నింగ్ ఇచ్చారు. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట చక్కర్లు కొడుతోంది.

Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com